http://www.agnidharanews.com

# అగ్నిధార

గురువారం 30 ఏప్రిల్ 2026

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## బాలికలదే పైచేయి



- పదో తరగతి ఫలితాలు విడుదల..
- టెన్త్ ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణత
- బాలురు - 94.07శాతం.. బాలికలు -96.26 శాతం
- 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు -5731
- 0 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు -06
- 99.30 శాతంతో ములుగు జిల్లా ఫస్ట్
- 89.23శాతంతో హైదరాబాద్ లాస్ట్



## మే 4న బీజేపీ హ్యాట్రిక్ ఖాయం

- ఐదు రాష్ట్రాల్లో మాదే విజయం: ప్రధాని మోదీ
- బంగాల్‌తో సహా 4 రాష్ట్రాలు, యూటీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం
- ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొంటున్న ప్రజలకు అభినందనలు
- మే 4న ఫలితాలు వికసిత భారత్ సంకల్పాన్ని బలోపేతం చేస్తాయి
- డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల యూపీ అభివృద్ధిపథంలో సాగుతోంది
- 'ఎన్నికల ఫలితాలతో వికసిత్ భారత్ సంకల్పం బలోపేతం'



## ఆగస్టులోనే పరిషత్ ఎన్నికలు!

- ఇప్పటికే ఆలస్యమైన ఈ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు
- మరికొన్ని రోజుల పాటు ఈ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యేలా లేవు
- జనగణన, ఉద్యోగుల బదిలీలతో పాలనపరమైన నిర్ణయాల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో ఉండదని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి

హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని వేచి చూస్తున్న ఆశావహులకు మరో బిగ్ షాక్ తగిలేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆలస్యమైన ఈ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. మరికొన్ని రోజుల పాటు ఈ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యేలా లేవు. జనగణన, ఉద్యోగుల బదిలీలతో పాలనపరమైన నిర్ణయాల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో ఉండదని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. దీంతో ప్రత్యేక అధికారులే పాలన సాగించనున్నారు. తెలంగాణలో గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు - మిగతా3లో

## గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్‌గా హైదరాబాద్

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- హైనెకెన్ లాంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఇక్కడి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, రెడీ టూ కొలాబరేట్, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలకు, పారిశ్రామిక ప్రగతికి నిదర్శనం
- హైదరాబాద్‌ను కేవలం ఐటీ డెస్టినేషన్‌గా కాకుండా, ప్రపంచ శ్రేణి వ్యాపార పరిష్కారాలకూ చిరునామాగా మారుతోంది
- అంతర్జాతీయ ఐటీ దిగ్గజాల మొదలు... మ్యానుఫ్యాక్చరింగ్, కన్స్యూమర్ గూడ్స్ కంపెనీల వరకు తమ వ్యూహాత్మక కేంద్రాల ఏర్పాటు కోసం హైదరాబాద్‌నే మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుంటున్నాయి



హైదరాబాద్

హైదరాబాద్‌ను 'గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)ను కేవలం 'బ్యాక్ ఆఫీస్' ఆపరేషన్లకే పరిమితం కాకుండా... స్ట్రాటెజిక్ ఇన్నోవేషన్స్, హై వాల్యూ ప్రొడక్టివిటీకి కేంద్రాలైన గ్లోబల్ వాల్యూ సెంటర్లు(జీవీసీ)గా మార్చేలా కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్రూయింగ్ కంపెనీ హైనెకెన్ నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో 'హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా' పేరిట 76వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జీసీసీని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. - మిగతా3లో



## తెలంగాణలో పెట్రోల్, డీజీల్ కొరత

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పెట్రోల్ కొరతపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- పెట్రోల్, డీజీల్‌ను ఎవరూ ఇళ్లలో నిల్వ చేసుకోవద్దు
- చమురు నిల్వలు లేకపోతే ప్రభుత్వమే ప్రకటిస్తుంది


హైదరాబాద్

మన దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పెట్రోల్ కొరతపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా3లో

## అండమాన్‌లో జరుగుతున్నది అభివృద్ధి కాదు



- పర్యావరణ నాశనం- రూ.లక్షల కోట్ల దోపిడి
- అండమాన్‌లో జరుగుతున్నది అభివృద్ధి కాదు
- అతిపెద్ద పర్యావరణ చౌర్యం
- లెఫ్టినెంట్ గవర్నర్ రాజులా వ్యవహరిస్తున్నారు : రాహుల్ గాంధీ



## ఉత్తర భారతదేశ నాస్తికుడు శబరిమల ఆలయంలోకి ప్రవేశ హక్కును ఎలా పొందగలడు?

- ఆలయ ప్రవేశ హక్కుకు సంబంధించిన అంశంపై నిర్ణయం తీసుకునేటప్పుడు, ఆ హక్కును కోరుతున్నది
- భక్తుడా లేదా నాస్తికుడా అనే విషయాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందని వ్యాఖ్య

## ప్రభంజనం ఎన్డీయేదే




- ఐదు రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు..
- మే 4న ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.
- తమిళనాడు: డీఎంకే కూటమి: 125-145, అన్నా డీఎంకే కూటమి: 65-80, టీవీకే: 18-24.
- కేరళ: ఎల్‌డీఎఫ్: 55-65, యూడీఎఫ్ 75-87, ఎన్డీయే: 0-3.
- పుదుచ్చేరి: బీజేపీ కూటమి: 16-19, కాంగ్రెస్ కూటమి: 10-12.
- బంగాల్: తృణమూల్ కాంగ్రెస్: 177-187, బీజేపీ: 95-100.
- యాక్సిస్ మై ఇండియా:
- అసోం: బీజేపీ కూటమి: 88-100, కాంగ్రెస్ కూటమి 24-36.

వివరాలు 2లో..



## పాత చట్టాలే చాలు

- విద్వేష ప్రసంగాల నియంత్రణపై సుప్రీం కోర్టు కీలక ఆదేశం
- విద్వేష ప్రసంగాల్ని ఆపేందుకు కొత్త మార్గదర్శకాలు అవసరం లేదు
- ఈ అంశంలో చట్టబద్ధమైన శూన్యత లేదు

# మే 4న బీజేపీ హ్యాట్రిక్ ఖాయం..

ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి విజయం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేరళ, తమిళనాడు, అసోం, బంగాల్?, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్ఛేరి ఎన్నికల్లో విజయం తమదేనని పేర్కొన్నారు. బుధవారం బంగాల్? రెండో దశ ఎన్నికల్లో ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనడాన్ని ఆయన ప్రశంసించారు. ప్రజాస్వామ్య పండుగల్లో ఇది ఒక ముఖ్యమైన రోజు అని అభివర్ణించారు. ఉత్తర్?ప్రదేశ్?లోని హర్దోయ్?లో గంగా ఎక్స్?ప్రెస్? వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ప్రజాస్వామ్య పండుగలో ఇవాళ కీలకమైన రోజు. బంగాల్‌లో రెండో దశ పోలింగ్ కొనసాగుతోంది. మొదటి దశ మాదిరిగానే ప్రజలు పెద్ద ఎత్తున ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేస్తున్నారు. సోషల్ మీడియాలో పొడవైన క్యూల దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బంగాల్‌లో భయరహిత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి. కానీ, గతంలో అలాంటి పరిస్థితి ఉండేది కాదు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యం బలపడుతుండడానికి నిదర్శనం. రికార్డు స్థాయిలో ఓటింగ్?లో పాల్గొంటున్న ఓటర్లకు నా అభినందనలు" అని ప్రధాని పేర్కొన్నారు.



ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ-ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిందని ప్రధాని గుర్తు చేశారు. ఈ క్రమంలో వరుసగా మూడో విజయాన్ని కూడా నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, గుజరాత్‌లో మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీలు, నగర పంచాయతీల్లో 80 నుంచి 85 శాతం స్థానాలను బీజేపీ గెలుచుకుందని కూడా మోదీ చెప్పారు. అయితే, మే 4న వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వికసిత్ భారత్ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. అవి దేశాభివృద్ధి వేగానికి కొత్త శక్తి ఇవ్వనున్నాయని అన్నారు.

మరోవైపు, కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి బిల్లు ఇరుపార్టీలు వ్యతిరేకించాయని మండిపడ్డారు. ఆ పార్టీలు అభివృద్ధికి, మహిళలకు వ్యతిరేకమన్నారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొంది ఉంటే, 2029 ఎన్నికల తర్వాత లోక్?సభ, రాష్ట్రశాసన సభల్లో మహిళలకు రిజర్వేషన్లు లభించేవన్నారు. ఇతర ఏ కేటగిరీలో సీట్లను తగ్గించకుండానే, పెద్ద సంఖ్యలో మహిళలు ఎన్నికై దిల్లీకి చేరుకునేవారని పేర్కొన్నారు. అయితే, సమాజ్ వాదీ పార్టీ, దాని మిత్రపక్షాలు పట్ల యూపీ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు.

**'గతంలో యూపీని బిమారు రాష్ట్రంగా పిలిచేవారు'**

అలాగే, బీజేపీ హయాంలో జరిగిన ఉత్తర్ ప్రదేశ్ అభివృద్ధి గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఒకప్పుడు గుంతల రోడ్లకు గుర్తింపు పొందిన ఉత్తర్‌ప్రదేశ్, ఇప్పుడు అత్యధిక ఎక్స్‌ప్రెస్ వేలు కలిగిన రాష్ట్రంగా మారుతోందని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల యూపీ అభివృద్ధిపథంలో సాగుతోందని ప్రధాని తెలిపారు.

"గత ప్రభుత్వాలు హర్దోయ్, ఉన్నావ్ లాంటి జిల్లాల్లో పారిశ్రామిక కారిడారు ఏర్పాటు చేయాలని ఆలోచన చేసేవా? హర్దోయ్ నుంచి కూడా ఎక్స్‌ప్రెస్ వే వెళ్తుందని ఎవరైనా ఊహించారా? ఈ పనులు బీజేపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతాయి. గతంలో యూపీని వెనకబడిన (బిమారు) రాష్ట్రంగా పిలిచేవారు. అదే ఉత్తర్‌ప్రదేశ్ నేడు ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థికవ్యవస్థ దిశగా సాగుతోంది. ఇది పెద్ద లక్ష్యమే. దీని వెనుక అంతే పెద్ద సన్నద్ధత కూడా ఉంది. యూపీ వద్ద అసమానమైన శక్తి ఉంది. దేశంలో అతిపెద్ద యువశక్తి యూపీ వద్ద ఉంది. ఈ శక్తితో యూపీని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చబోతున్నాం. యూపీలో కొత్త ఉద్యోగాలు, పరిశ్రమలు ఏర్పాటవుతాయి. పెద్దఎత్తున వచ్చే పెట్టుబడుల ద్వారా ఆర్థిక ప్రగతి ద్వారాలు తెరుచుకుంటాయి. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని ప్రధాని పేర్కొన్నారు.

# ప్రభంజనం ఎన్డీయేదే

**ఢిల్లీ:** దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఎగ్జిట్ పోల్స్ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం ఖాయమని తేల్చాయి. మే 4న ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల కౌంటింగ్ జరగాల్సి ఉండగా.. వివిధ సంస్థలు ఓటర్ల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఎగ్జిట్స్ పోల్స్‌ను విడుదల చేశాయి.

తమిళనాడు (మొత్తం: 234)
ఏజెన్సీ: పీపుల్స్ పల్స్
డీఎంకే: 125 -- 145
ఏడీఎంకే: 65 -- 80
టీవీకే (విజయ్): 18 -- 24
ఇతరులు : 2 -- 6

కేరళ (మొత్తం: 140)
ఏజెన్సీ: పీపుల్స్ పల్స్

యూడీఎఫ్: 75 -- 85
ఎల్‌డీఎఫ్: 55 -- 65
బీజేపీ: 0 -- 3
ఇతరులు : 0

అసోం (మొత్తం: 126)
ఏజెన్సీ: యాక్సిస్ మై ఇండియా

బీజేపీ: 88 -- 101
కాంగ్రెస్: 15 -- 36
ఏఐయూడీఎఫ్: 0
ఇతరులు: 0 -- 3

పశ్చిమ బెంగాల్ (మొత్తం: 294)
ఏజెన్సీ: పీపుల్స్ పల్స్

టీఎంసీ: 177 -- 187
బీజేపీ: 95 -- 110
కాంగ్రెస్: 1 -- 3
వాపక్షాలు: 0 -- 1

పుదుచ్చేరి (మొత్తం: 30)
ఏజెన్సీ: పీపుల్స్ పల్స్

ఎన్ఆర్‌సీ: 16 -- 19
కాంగ్రెస్: 10 -- 12
ఇతరులు: 1 -- 2

**అస్సాంలో బీజేపీ సునామీ**

అస్సాంలో బీజేపీ మరో భారీ విజయం సాధించబోతోందని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెబుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత శర్మ నేతృత్వంలోని ఆ పార్టీ మరోసారి అధికారంలోకి రావచ్చు. యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ ప్రకారం ఆ పార్టీ 88-100 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి 24-36 సీట్లతో సరిపెట్టుకోవచ్చని తెలిపింది.

**పశ్చిమ బెంగాల్**

రెండో దశ పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ప్రకారం టీఎంసీ, బీజేపీ మధ్య పోటీ కనిపిస్తోంది. అధిక సంఖ్యలో పోలింగ్ శాతం నమోదు కావడం, ముఖ్యంగా మహిళా ఓటర్లు పాల్గొనడం ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

**తమిళనాడు**

234 నియోజకవర్గాల్లో ఒకే దశలో జరిగిన ఎన్నికల్లో 82 శాతం పైగా ఓటింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం డీఎంకే ఆధిక్యం కొనసాగుతుందని అంచనాలు ఉన్నాయి. అదే సమయంలో టీవీకే విజయ్, బీజేపీ కూడా కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని సూచనలు వెలువడుతున్నాయి.

**కేరళం**

ఎప్పటిలాగే అధిక ఓటింగ్ నమోదైన కేరళంలో ఎగ్జిట్ పోల్స్ స్పష్టమైన మెజారిటీని చూపడం కష్టం. ఎల్‌డిఎఫ్, యూడిఎఫ్ మధ్య పోటీ తీవ్రంగా ఉందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. ఈ రాష్ట్రంలో ఓటర్ల అభిప్రాయం చివరి నిమిషంలో మారే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

**అసోం**

85 శాతం పైగా పోలింగ్ నమోదైన అసోంలో బీజేపీ ఆధిక్యం కొనసాగుతుందని ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్నాయి. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలతో పోటీ ఉన్నప్పటికీ, ఎన్డీఏ బలంగా నిలుస్తుందని అంచనాలు ఉన్నాయి.

**పుదుచ్చేరి**

89 శాతం పైగా పోలింగ్ నమోదైన పుదుచ్చేరి రాష్ట్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ఆధిక్యం సాధించే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అధిక ఓటింగ్ ప్రజల రాజకీయ చైతన్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం బీజేపీ అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బలంగా నిలుస్తోంది. తమిళనాడులో డీఎంకే ఆధిక్యం కొనసాగుతుందని అంచనాలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ--బీజేపీ మధ్య పోటీ, కేరళలో ఎల్‌డిఎఫ్--యూడిఎఫ్ మధ్య పోటీ కనిపిస్తోంది.

# ఉత్తర భారతదేశ నాస్తికుడు శబరిమల ఆలయంలోకి ప్రవేశ హక్కును ఎలా పొందగలడు?

ఉత్తర భారతదేశంలోని నాస్తికుడు శబరిమల ఆలయంలోకి ప్రవేశ హక్కును ఎలా పొందగలడని సుప్రీంకోర్టు బుధవారం ప్రశ్నించింది. ఆలయ ప్రవేశ హక్కుకు సంబంధించిన అంశంపై నిర్ణయం తీసుకునేటప్పుడు, ఆ హక్కును కోరుతున్నది భక్తుడా లేదా నాస్తికుడా అనే విషయాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా తొమ్మిది మందితో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్‌లు బి.వి. నాగారత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్, జస్టిస్ ప్రసన్న బి. వరలే, జస్టిస్ ఆర్. మహాదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ఉన్నారు.



2018 నాటి సుప్రీం తీర్పును సమర్థిస్తున్న బిందు అమ్మిని, కనకదుర్గ అనే ఇద్దరు మహిళల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, పిటిషనర్లలో ఒకరు షెడ్యూల్డ్ కులానికి చెందిన మహిళ అని, ఆమెను ఆలయ సందర్శన నుంచి నిరోధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 (అంటరానితనం నిర్మూలన)ను ఉల్లంఘించడమే అవుతుందని వాదించారు. కులరహిత హిందువులు శబరిమలలోకి ప్రవేశించవచ్చని, కానీ మహిళలు ప్రవేశించలేరని చెబుతున్నారని వాదించారు. కానీ, ఆర్టికల్ 17 కారణంగా కులంతో సంబంధం లేకుండా పురుషులందరూ ప్రవేశించవచ్చని ఆమె కోర్టుకు చెప్పారు. పిటిషన్?దారులు షెడ్యూల్డ్ కులానికి చెందినది కావడం వల్ల నిరోధించలేదని, కానీ ఆమె 10 నుంచి 50 సంవత్సరాల వయస్సు వర్గానికి చెందినది కావడం వల్లే అడ్డుకున్నారని విన్నవించారు. ఆలయంలోకి ప్రవేశించి ఆరాధించే హక్కు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(1) ప్రకారం ఒక ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. 2018 నాటి తీర్పు వెలువడిన తర్వాతే ఇద్దరు మహిళలు ఆలయానికి వెళ్లారని ఆమె గుర్తు చేశారు.

"ఈ కాలంలో ఒక మహిళ హోదా ఏమిటి ఇది అత్యంత సృజనాత్మకమైన, అత్యంత సంతానోత్పత్తి కలిగిన కాలం కాదా మీరు నన్ను సగం జీవితం గడపమని చెప్పలేరు. 10 నుంచి 50 ఏళ్ల మధ్య జీవించడాన్ని మానేసి, కేవలం 10 ఏళ్ల లోపు లేదా 50 ఏళ్ల తర్వాత మాత్రమే జీవించమంటే అది తీవ్రమైన వంచనకు దారితీస్తుంది. వారు బయటకు వచ్చినప్పుడు, కొందరు సంఘ్ నాయకులు 'శుద్ధీకరణ' (పవిత్రీకరణ) గురించి మాట్లాడారు. నేను ఈ కోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశాను. ఆ సమయంలో తీర్పు పూర్తి స్థాయిలో అమలులో ఉంది. ఆలయం పైకి ఎక్కి 'దర్శనం' చేసుకోగలిగిన ఇద్దరు మహిళలు వీరే. అప్పటి నుంచి మరెవరూ దీనిని సాధించలేదు ఎందుకు ఎందుకంటే ప్రభుత్వం వారికి సహకరించలేదు. పైకి వెళ్లడానికి రక్షణ కల్పించడానికి వారు నిరాకరించారు. నేను ఈ కోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసి, అందులో ఆ మహిళలు ఎవరు, వారు భక్తులేనా, వారు ఏ రాష్ట్రానికి చెందినవారు అనే విషయాలతో సహా అన్ని వాస్తవాలను రికార్డులో ఉంచాను" అని న్యాయవాది జైసింగ్? తెలిపారు.

ఈ క్రమంలోనే స్పందించిన న్యాయమూర్తి జస్టిస్? బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ హక్కును ఎవరు కోరుతున్నారు? ఒక భక్తురాలు ఈ హక్కును కోరుతున్నారా? లేక ఎవరి ప్రేరణతోనో ఒక భక్తురాలు కాని వ్యక్తి దీనిని కోరుతున్నారా? ఈ ఆలయంతో ఎటువంటి సంబంధం లేని ఒక వ్యక్తి ఉత్తర భారతదేశంలో ఎక్కడో ఉన్నారు. ఈ ఆలయం దక్షిణ భారతదేశంలో ఉంది. ఇలాంటి సమయంలో ప్రవేశ హక్కును కోరడం అనే అంశాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది" అని అన్నారు. 2018 సెప్టెంబర్లో 4:1 మెజారిటీ తీర్పుతో 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించకుండా నిరోధిస్తున్న నిషేధాన్ని సుప్రీం కోర్టు ఎత్తివేసింది. శతాబ్దాల నాటి ఈ హిందూ మత ఆచారం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.

## అండమాన్‌లో జరుగుతున్నది అభివృద్ధి కాదు

అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ ఎత్తున భూకబ్జా, పర్యావరణ విధ్వంసం, పరిపాలనా అవినీతి జరుగుతోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. స్థానిక ఆదివాసీలు, పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. వలసదారులకు, గిరిజనులకు సరైన పరిహారం అందడం లేదని అన్నారు. విజయపురంలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, "మీ భూములను మీ నుంచి తీసుకుని అదానీ వంటి పెద్ద వ్యాపారవేత్తలకు ఇస్తున్నారు. ఇక్కడ అటవీ హక్కుల చట్టం అమలు కావడం లేదు. వలసదారులకు, గిరిజనులకు సరైన పరిహారం అందడం లేదు. నిశ్శబ్దంగా భారతదేశ వారసత్వాన్ని దోచుకుంటున్నారు" అని ఆరోపించారు. అండమాన్ నికోబార్ ప్రజల సమస్యలను దేశ ప్రజలకు తెలియజేస్తామని, వారి హక్కులను కాపాడేందుకు ప్రయత్నిస్తామని ఆయన అన్నారు.

**అక్కడ నీటి సమస్య కూడా**

అండమాన్‌లో పరిపాలనాపరమైన సమస్యలు ఉన్నాయని ఆరోపిస్తూ, నీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే లెఫ్టినెంట్ గవర్నర్ వైపు నుంచి అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. "ఇక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ రాజులా వ్యవహరిస్తున్నారు. తనకు నచ్చినట్లు చేస్తున్నారు. ఆయన తన ఇల్లు, కార్యాలయానికి 'లోక్ భవన్' అని పేరు పెట్టుకున్నా, ప్రజలను కలవరు. ప్రజల మాట వినాలి, గౌరవించాలి. ఇది నియంతృత్వం కాదు" అని అన్నారు. "నికోబార్, అండమాన్ దీవులలో జరుగుతున్న దాని గురించి నేను మాట్లాడాలనుకుం టున్నాను. ఇక్కడ హర్మ్యాజ్? గురించి ప్రస్తావించాల్సిన అవసరం లేదు. ఇక్కడి ప్రధాన సమస్య పర్యావరణ దొంగతనం. లక్షల కోట్ల రూపాయల విలువైన చెట్లను దొంగిలిస్తున్నారు. భూములను ఆక్రమిస్తున్నారు. ఇదే ఇక్కడి ప్రధాన సమస్య."

**నిరాశ్రయులవుతున్న స్థానిక ప్రజలు**

మరోవైపు గ్రేట్ నికోబార్‌లో కేంద్రం చేపట్టిన అభివృద్ధి పనుల వల్ల భారీ స్థాయిలో పర్యావరణ విధ్వంసం జరుగుతోందని, స్థానిక ప్రజలు నిరాశ్రయులవుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ప్రాజెక్టును దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా జరుగుతున్న "అతిపెద్ద కుంభకోణాలలో" ఒకటిగా ఆయన అభివర్ణించారు.

**నికోబార్‌కు రాహుల్ పర్యటన**

తాజాగా రాహుల్ గాంధీ గ్రేట్ నికోబార్‌ను సందర్శించినట్లు ఆయన 'ఎక్స్?' వేదికగా తెలిపారు. అలాగే ఆ ప్రాజెక్టుల వల్ల అడవులు, ఆదివాసీ వర్గాలపై పడుతున్న ప్రభావం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "నేను ఈరోజు గ్రేట్ నికోబార్‌లో పర్యటించాను. నా జీవితంలో నేను చూసిన అత్యంత అద్భుతమైన అడవులు ఇవి. తరతరాల జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకున్న చెట్లు, ఎన్నో ఏళ్లుగా పెరిగిన అడవులు ఇవి. ఈ ద్వీపంలోని ప్రజలు- అటు ఆదివాసీలు, ఇటు స్థిరపడిన వారు ఎంతో మంచివారు. కానీ వారి హక్కులను దోచుకుంటున్నారు" అని పేర్కొన్నారు.

**గొడ్డలి వేటుకు సిద్ధంగా ఉన్న లక్షలాది చెట్లు**


ప్రభుత్వం దీనిని 'ప్రాజెక్ట్' అని పిలుస్తోందని, కానీ వాస్తవానికి ఇది ప్రకృతి విధ్వంసమని అన్నారు. "ఇది గొడ్డలి వేటుకు సిద్ధంగా ఉన్న లక్షలాది చెట్లకు గుర్తు. 160 చదరపు కిలోమీటర్ల వర్షారణ్యాన్ని నాశనం చేయనున్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా వారి నివాసాలను లాక్కుంటున్నారు" అని విమర్శించారు. "ఇది అభివృద్ధి కాదు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం. గ్రేట్ నికోబార్‌లో జరుగుతున్నది మన కాలంలో దేశ సహజ సంపద, గిరిజన వారసత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న అతిపెద్ద కుంభకోణం. ఘోరమైన నేరం. ఇది ఆగాలి. భారతీయులు నిజాన్ని గుర్తిస్తే, దీన్ని ఆపడం సాధ్యమే" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

## పాత చట్టాలే చాలు

దేశంలో విద్వేష, రెచ్చగొట్టే ప్రసంగాల విషయంలో సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ తరహా ప్రసంగాల్ని నియంత్రించడానికి కొత్త చట్టాలేమీ అవసరం లేదని, ఇప్పటికే ఉన్న చట్టాలు సరిపోతాయని వ్యాఖ్యానించింది. విద్వేష, రెచ్చగొట్టే ప్రసంగాలను నియంత్రించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేయాలంటూ పిటిషన్ దాఖలైంది. మతపరమైన, రెచ్చగొట్టే కంటెంట్‌ను అడ్డుకునేలా నూతన మార్గదర్శకాలు విడుదల చేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ జరిపి, తాజా వ్యాఖ్యలు చేసింది. విద్వేష ప్రసంగాల్ని ఆపేందుకు కొత్త మార్గదర్శకాలు అవసరం లేదని తెలిపింది. ఈ అంశంలో చట్టబద్ధమైన శూన్యత లేదని అభిప్రాయపడింది. ఇప్పటికే విద్వేష, రెచ్చగొట్టే ప్రసంగాలపై తగిన క్రిమినల్ అభియోగాలు, నేరాలు, శిక్షలు చట్టాల్లో ఉన్నాయని కోర్టు తెలిపింది. ప్రస్తుతం ఉన్న క్రిమినల్ చట్టాల్లో దీనికి తగిన మార్గదర్శకాలు, శిక్షలు ఉన్నాయని, అవి సరిపోతాయని కోర్టు తెలిపింది. ఈ ప్రసంగాల్ని అడ్డుకునేందుకు కొత్త చట్టాలు అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. అలాగే, ఈ విషయంలో చట్టాలు చేసి, మార్గదర్శకాలు జారీ చేసే అధికారం రాజ్యాంగపరంగా న్యాయవ్యవస్థకు లేదని వెల్లడించింది. ఈ విషయంలో చట్టాలు చేయాలని వ్యవస్థల్ని కోర్టు ఆదేశించగలదు కానీ, అందులోకి దిగి చట్టాలు చేసే అధికారం కోర్టులకు లేదని తెలిపింది. అందువల్ల ఈ విషయంలో నూతన మార్గదర్శకాలు విడుదల చేయలేమని ప్రకటించింది. విద్వేష ప్రసంగాల్ని అడ్డుకునేందుకు చట్టంలో ఐపీసీ సెక్షన్ల ప్రకారం పలు చట్టాలు అమల్లో ఉన్నట్లు కోర్టు తెలిపింది. మతపరమైన, ప్రజా శాంతికి భంగం కలిగించే వాటిని ఆయా చట్టాలు అడ్డుకుంటున్నాయని కోర్టు చెప్పింది. ఇలాంటి కేసుల విషయంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం వంటివి చేస్తే ఫిర్యాదుదారులు పోలీసు ఉన్నతాధికారుల్ని లేదా న్యాయవ్యవస్థను సంప్రదించాలని సూచించింది.

## ఆ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు..

## 12వ తరగతి ఫలితాలపై సీబీఎస్ఈ




ఈ సంవత్సరం తొలిసారిగా సీబీఎస్ఈ 12వ తరగతి సమాధాన పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ మూల్యాంకన ప్రక్రియలో సాంకేతిక లోపం తలెత్తిందని, దాంతో మూల్యాంకనం ఆలస్యమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సాంకేతిక లోపం తలెత్తడంతో మూల్యాంకన ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని బోర్డు ఖండించింది. తాము ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ విధానంలో మూల్యాంకన ప్రక్రియ సజావుగా జరుగుతోందని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ఈ అంశంపై సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ పీటీఐతో మాట్లాడారు. మే మూడో వారం నాటికి ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన విధానంలో సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతూ వచ్చిన మీడియా కథనం వాస్తవదూరంగా ఉందన్నారు. ఎవాల్యుయేషన్ ప్రక్రియ గతంలో కన్నా అద్భుతంగా జరుగుతోందని తెలిపారు. ఈ విధానంపై టీచర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, తమకు సెల్ఫీలు, ఫొటోగ్రాఫ్‌లు, మెసేజ్‌లు పంపుతూ కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఎవాల్యుయేషన్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతోందని, ఫలితాలను మే మూడో వారం నాటికి విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. కాగా ఈ విద్యా సంవత్సరం నుంచి బోర్డు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 12వ తరగతి సమాధాన పత్రాలను సంప్రదాయ పద్ధతిలో కాకుండా.. తొలిసారిగా 'ఆన్-స్క్రీన్ మార్కింగ్' విధానంలో డిజిటల్‌గా మూల్యాంకనం చేస్తున్నారు. ఈ విధానం వల్ల ఫలితాల ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా పారదర్శకత పెరుగుతుందని బోర్డు వర్గాలు చెబుతున్నాయి.

## సంపాదకీయం

# ఆప్.. సోపాలు

ఒకప్పుడు ఆమ్ఆద్మీ పార్టీ పేరు వింటే చాలు, సగటు మనిషి ఛాతీ గర్వంతో మరో రెండు అంగుళాలు విశాలమయ్యేది. అవినీతిని అంతమొందించడంలో, ప్రజారంజకమైన పాలన అందించడంలో ఆ పార్టీ ముందుంటుందన్న ధైర్యం వారిలో అడుగడుగునా కనబడేది. కానీ, పద్నాలుగేళ్లు తిరిగేసరికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవినీతి కూపంలో నిండా మునిగిపోయి, ఊపిరాడక సతమతమవుతున్న ఆ పార్టీ సగటు మనిషికి ఏనాడో దూరమైంది. ఈ పరిస్థితికి కొంతవరకూ ఆ పార్టీ అధినేత కారణం కాగా, మరికొంత కేంద్రంలో చక్రం తిప్పుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కారణం. ఈ మిత్రద్వయం తరచూ వేస్తున్న ఎత్తుగడలకు చిత్తవడం కేజ్రీ వంతవుతోంది. మద్యం కుంభకోణం కేసులు బనాయించి, ముఖ్యమంత్రినే అరెస్ట్ చేయించి, ఆ కేసుల ఆధారంగా పార్టీ పెద్దలపై అవినీతి ముద్ర వేసి, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ కమలనాథులు అంతటితో ఆగలేదు. రాజ్యసభ సభ్యులైన ఏడుగురు ఆమ్ఆద్మీ పార్టీ నేతలను తమవైపు తిప్పుకుని, బిజెపిలో విలీనం చేసుకోవడం తాజా పరిణామం. ఢిల్లీ మద్యం కేసులో సిబిఐ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో రాబోయే పంజాబ్ ఎన్నికల్లో గెలుపు తమదేనని సంతోషిస్తున్న కేజ్రీవాల్‌కు ఆ సంబరం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. నిన్నటివరకూ తనకు, పార్టీకి కుడిభుజంలా నిలబడినవారు సైతం అకస్మాత్తుగా ఇలా 'ఫిరాయించడం'తో కేజ్రీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆమ్ఆద్మీ పార్టీ పెట్టకముందునుంచీ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా మెలగిన రాఘవ్ చద్దా, స్వాతి మలీవాల్ వంటివారు సైతం బిజెపి గూటికి చేరిపోవడం వింతల్లోకెల్లా వింత. రాజ్యసభలో తమ బలాన్ని పెంచుకోవడం, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో పాగా వేయడం లక్ష్యంగా మోడీ, షా ద్వయం తాజా వ్యూహానికి తెర తీశారన్నది విస్పష్టం. ఆప్ ఎంపిల చేరికతో రాజ్యసభలో బిజెపి సభ్యుల బలం 113కి చేరగా, ఎన్‌డిఎ బలం 146కు పెరిగింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) లో లొసుగులను ఆసరా చేసుకుని ఇలా ఇతర పార్టీల సభ్యులకు ఎర వేసినందుకు మోడీ, అమిత్ షాలను తప్పుబట్టడంలో తప్పేమీ లేదు. అయితే, ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉంటూ, పదేళ్లపాటు ఢిల్లీని పాలించి చాలినంత రాజకీయ, పాలనా అనుభవం గడించి కూడా.. ప్రత్యర్థుల ఎత్తుగడలను చివరిదాకా పసిగట్టలేకపోయినందుకు కేజ్రీవాల్‌నూ అంతే తప్పుపట్టాలి. ప్రాంతీయ పార్టీల పొడ అసలే గిట్టని భారతీయ జనతా పార్టీ పెద్దలు, వాటి ఊపిరి తీసేందుకు ఎంతకైనా తెగిస్తారనేది గత చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది. దేశ రాజధానిలో తిష్ఠవేసుకుని కూర్చుని, తమకు పక్కలో బల్లెంలా మారిన ఆప్‌ను అంతమొందించాలన్నది మోడీ, అమిత్ షాల చిరకాల వాంఛ. అందులో చాలావరకూ కృతకృత్యులయ్యారన్నది ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతోనే రుజువైంది. ఇక పంజాబ్ లోనూ ఆప్‌ను అధికారంనుంచి దింపడమే లక్ష్యంగా కేజ్రీవాల్ ఆరోపించినట్లు 'ఆపరేషన్ లోటస్'కు తెరతీశారు. మునుపటి ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్ విజ యం వెనుక కీలకపాత్ర పోషించిన రాఘవ్ చద్దాకు గాలం వేయడం అందులో భాగమే. అగ్నికి ఆజ్యం తోడైనట్లు, బిజెపి నేతల ఎత్తుగడలకు కేజ్రీవాల్ స్వయంకృతాపరాధాలు తోడయ్యాయి. అవినీతిని అంతం చేస్తానని నమ్మబలికిన ఆప్ అదే అవినీతికి ఆలవాలమైందన్న బిజెపి పెద్దల ఆరోపణలకు కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని తలదన్నుతూ కట్టుకున్న ఇల్లు, మద్యం కుంభకోణం వంటివి బలం చేకూర్చాయి. ఇప్పటికైనా మించింది లేదు. తమ పార్టీ నేతలు మరికొందరు చేజారకముందే ఆప్ అధినేత జాగ్రత్తపడటం మంచిది. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టేలా పదునైన వ్యూహాలను రచించగలగాలి. కొన్నేళ్లుగా పంజాబ్ లో పలువురు ఆప్ నాయకులను బిజెపి నయానో భయానో తమవైపు తిప్పుకోగలిగింది. ఈ తెలివిడి, రాజకీయ చతురత లేకనే ఆప్ అగ్రనేతలు ప్రత్యర్థులు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం భారత రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా బీజేపీలో చేరిక. ఆప్ కీలక నేతగా పేరున్న రాఘవ్, అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ నిర్ణయం వెనుక కారణాలపై పలు ఊహాగానాలు చెలరేగుతుండగా, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాఘవ్ చద్దా బీజేపీలో చేరడానికి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. "రాఘవ్ చద్దా తన సోదరి పరిణీతి చోప్రా భర్త కావడంతో ఆయనను కాపాడుకోవడానికి ప్రియాంక ఈ నిర్ణయం తీసుకున్నారు" అని కౌర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రాఘవ్ వెనుక పడ్డారని, త్వరలోనే ఆయనపై ఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రియాంకకు ముందే సమాచారం అందిందని ఆమె వెల్లడించారు. అందుకే తన చెల్లెలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాఘవ్‌ను బీజేపీ వైపు మళ్లించారని కౌర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, రాఘవ్ చద్దాకు ఆప్ అధిష్టానానికి మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని నవజ్యోత్ కౌర్ సిద్ధూ వివరించారు. పార్టీ కోసం రాఘవ్ సరిగా మాట్లాడటం లేదని ఆప్ నాయకత్వం భావించిందని, ఆ కారణంగానే వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆమె తెలిపారు. ఏదైనా తప్పు జరిగినప్పుడు అప్పుడే గళం విప్పాలని, నాలుగేళ్ల తర్వాత మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజకీయ మార్పు రాఘవ్ చద్దా సోషల్ మీడియా ఇమేజ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బీజేపీలో చేరిన మరుసటి రోజే ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలకు పైగా (రెండు మిలియన్లు) ఫాలోవర్లను కోల్పోయారు. ఆప్ తన వ్యవస్థాపక సూత్రాలు, సిద్ధాంతాల నుంచి దూరంగా వెళ్లడంతో తాము బీజేపీలో విలీనమయ్యామని మీడియా సమావేశంలో చద్దా వెల్లడించారు.ఆప్ కోసం 15 ఏళ్లు నా రక్తం, చెమట ధారపోశాను.. సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పార్టీ పూర్తిగా పక్కకు తప్పుకుంది" అని ఆయన అన్నారు. "రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చు" అని తమ పార్టీలోని 10 మంది ఎంపీల బలాన్ని ప్రస్తావిస్తూ చద్దా తెలిపారు. "వారు ఇప్పటికే సంతకాలు చేశారు.. ఈ ఉదయం మేము సంతకాలు చేసిన లేఖలు, ఇతర పత్రాలతో సహా అవసరమైన అన్నింటిని రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించడం... విలీనానికి అనుమతించడం చకచకా జరిగిపోయాయి. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పుట్టిన ఆప్.. 14 ఏళ్ల తర్వాత పార్టీ చరిత్రలోనే అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది.సినీ ప్రముఖులు కునికా సదానంద్, ప్రకాష్ రాజ్ వంటి వారు కూడా రాఘవ్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన ఈ కీలక వ్యాఖ్యలపై ఇప్పటివరకు ప్రియాంక చోప్రా, పరిణీతి చోప్రా లేదా రాఘవ్ చద్దా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే, ఈ నిర్ణయం వెనుక నిజంగా ఇదే కథ ఉందా అనే ప్రశ్న ప్రజల్లో మొదలైంది. రాఘవ్ చద్దా రాకతో బీజేపీ బలం పెరుగుతుందా లేదా ఆమ్ ఆద్మీ పార్టీ దెబ్బతింటుందా అనేది వేచి చూడాలి.ఒకవైపు పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూ, మరోవైపు ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేసేలా రాజకీయ వ్యూహరచన చేయగలిగితేనే పంజాబ్‌లో ఆప్ అధికారాన్ని నిలుపుకునేది. మద్యం కుంభకోణ కేసులో సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును, తాజాగా తమ పార్టీ ఎంపిల విలీనం ఉదంతాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకువెళ్లగలగాలి. లేదంటే జాతీయ పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆమ్ఆద్మీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా పోయే పరిస్థితి దాపురిస్తుంది.

# ఉబుసుపోని పనులు

ఉబుసుపోని మనుషులు రకరకాల పనులు చేస్తారు. ఉబుసుపోని పనులకు అర్థం, పరమార్థం ఉండవు. ఉబుసుపోని మనుషులు నలుగురూ ఒకే చోటుకు చేరితే పోసుకోలు కబుర్లతో కాలక్షేపం చేస్తారు. కుదిరితే చతుర్ముఖ పారాయణాన్ని ప్రారంభిస్తారు. ఒంటరిగా ఉన్నప్పుడు ఉబుసుపోని మనుషులు-- అభిరుచి మేరకు పుస్తక పఠనంలోనో, కళాసాధనలోనో నిమగ్నమవుతారు. అంతటి అభిరుచులేవీ లేకుంటే, ఊరకే పడక్కుర్చీలో కూర్చునో, మంచంమీద వాలిపోయో పగటికలలు కంటారు. ఉబుసుపోని మనుషులకు పొరపాటున అదృష్టం బాగుండని అర్భక శ్రోతలెవరైనా దొరికితే, ఆవకాయ నుంచి అంతర్జాతీయ వ్యవహారాల వరకు అనర్గళంగా ప్రసంగించి, మేధాప్రదర్శన చేస్తారు. ఉబుసుపోని మనుషులు ఇది చేస్తారు, అది చేయరని నియమాలేమీ లేవు. ఉబుసుపోని సందర్భాల్లో మనుషులు తమ బుద్ధికి తోచిన పనులు చేస్తారు. ఉబుసుపోనితనం, దానివల్ల కలిగే విసుగు మనిషిని కుదురుగా ఉండనివ్వవు. రోజులు రొడ్డగొట్టుడుగా మారిపోయినప్పుడు; దినచర్యలో మార్పు లేనప్పుడు; జీవితంలో ఉత్తేజం లోపించినప్పుడు; బతుకు బొత్తిగా నిరర్థకంగా మారిపోయిందని అనిపించినప్పుడు-- మనిషికి ఉబుసుపోనితనం ఏర్పడుతుంది. దానివల్ల విసుగు పుడుతుంది. విరామ సమయాలను అర్థవంతంగా గడపలేని దుఃస్థితి తటస్థిస్తుంది. విశ్రాంతి మనశ్శాంతిని ఇవ్వలేని పరిస్థితి వాటిల్లుతుంది. ఉబుసుపోనితనం గురించి తత్త్వవేత్తలు, మనస్తత్త్వవేత్తలు, సాహితీవేత్తలు అనేక నిర్వచనాలను ఇచ్చారు. కొందరు ఉబుసుపోనితనంలోని సానుకూలతలను చూశారు. ఇంకొందరు ఉబుసుపోనితనాన్ని బూచిలా చూశారు. ఆధునిక మానసికశాస్త్ర పరిశోధకులు ఉబుసుపోనితనం మీద ఇప్పటికీ పరిశోధనలు సాగిస్తున్నారు. 'ఉబుసుపోనితనం నైతికవాదులకు ఒక గడ్డు సమస్య. నిజానికి లోకంలో జరిగే సగానికి సగం పాపాలు ఉబుసుపోనితనం పట్ల భయం వల్ల జరిగేవే' అన్నాడు ఇంగ్లిష్ తత్త్వవేత్త బెర్ట్రాండ్ రసల్. 'ఉబుసుపోనితనం: కోరికల కోసం కోరిక' అన్నాడు సుప్రసిద్ధ రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్. 'ఉబుసుపోనితనం-- అనుభవం గుడ్డు పెట్టే కలల పక్షి' అన్నాడు జర్మన్ తత్త్వవేత్త వాల్టర్ బెంజమిన్. 'ఉబుసుపోనితనం మీద కాస్తంత దృష్టి పెడితే, అది నమ్మశక్యం కానంత ఆసక్తికరంగా ఉంటుంది' అన్నాడు అమెరికన్ వైద్య నిపుణుడు జాన్ కాబత్‌జిన్. బహుశా, ఈ మేధావులంతా తమ తమ జీవితాల్లోని ఉబుసుపోనితనంతోనే ఇన్నిన్ని పరిశోధనలు సాగించి ఉంటారు. ఉబుసుపోని స్థితిలో ఖాళీగా ఉన్న మనిషి బుర్రను 'దయ్యాల కార్ఖానా'తో పోల్చాడు ఇంగ్లిష్ రచయిత జాన్ బున్యన్. ఉబుసుపోని ఖాళీ సమయాన్ని పనికిమాలిన సమయంగా చాలామంది పరిగణిస్తారు. కానీ, ఉబుసుపోనితనానికి కూడా ప్రయోజనాలు ఉన్నాయని చెబుతుంది ఆధునిక మనస్తత్త్వ శాస్త్రం. ఉబుసుపోని స్థితిలోనే మనిషిలోని సృజనాత్మకత రెక్కలు తొడుక్కుంటుందని ఇంగ్లండ్‌లోని సెంట్రల్ లాంకషైర్ వర్సిటీకి చెందిన మనస్తత్త్వ శాస్త్రవేత్తలు శాండీ మాన్, రెబెక్కా కాడ్‌మన్ కనుగొన్నారు. ఉబుసుపోని స్థితిలోనే ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం సహా పలు అద్భుత ఆవిష్కరణలు చేశాడని చెబుతారు. 'మనిషిలోని జిజ్ఞాసకు, సృజనశీలతకు ఉబుసుపోనితనమే ఉత్ప్రేరకం' అని 'యాపిల్' వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ చెబుతుండేవాడు. ఉబుసుపోనితనం గురించి డేనిష్ తత్త్వవేత్త సోరెన్ కీర్కగార్డ్ దాదాపు రెండు శతాబ్దాల కిందటే 'ద పవర్ ఆఫ్ నథింగ్‌నెస్'లో చర్చించాడు. ఇందులో ఆయన 'ఉబుసుపోనితనం అన్ని దుర్మార్గాలకూ మూలం' అని అభిప్రాయపడ్డాడు. ఉబుసుపోనితనంతో చాలామంది అర్థంలేని పనులు చేస్తుంటారు. అక్కడక్కడా కొందరు అనర్థకరమైన పనులు కూడా చేస్తుంటారు. ఇటీవల థాయ్‌లాండ్‌లో మాటినా అనే ఇరవై రెండేళ్ల ఉబుసుపోని కుర్రాడు ఏమీ తోచక అడవికి నిప్పుపెట్టి, కార్చిచ్చును రగిల్చాడు. ఉబుసుపోనితనం మనిషితో ఎంతటి పనైనా చేయిస్తుంది. అంతమాత్రాన ఉబుసుపోనితనం అనర్థాలకు హేతువు అని నిర్ధారణకు రావడం మాత్రం నిర్హేతుకమే అవుతుంది. ఉబుసుపోనితనమే లేకుంటే, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రవేత్తల ఆవిష్కరణలు ఉండేవేనా?!

# అప్పుల ఊబిలో అన్నదాత


దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా దేశ జనాభాలో అత్యధికులు ఆధారపడిన వ్యవసాయ రంగం తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతూనే ఉంది. అన్నదాతే దేశానికి వెన్నెముక అని పాలకులంటున్నా, వివిధ పథకాలు అమలుచేస్తున్నా, రైతన్నల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. నిజానికి రైతు శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం ఇస్తున్నామా అని ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి. దేశ జీడీపీలో 18.2శాతం వాటాతో సుమారు 42.3శాతం జనాభాకు వ్యవసాయ రంగం జీవనాధారాన్ని అందిస్తున్నదని 2024నాటి ఆర్థిక సర్వే పేర్కొంది. పారిశ్రామిక, సాంకేతిక, సేవా రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నా, జాతీయ స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది. ఏఐ అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నా వ్యవసాయ రంగం మాత్రం తిరోగమనంలో ఉంది. దేశానికి ఆహార భద్రత కల్పించే రైతన్న అప్పుల ఊబిలో పీకలలోతు దాకా కూరుకుపోతున్నాడు. ప్రభుత్వాలు రుణమాఫీ చేసినా సగటు రైతుకు అప్పుల భారం తప్పడం లేదు. ఆలిండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే--2019 పేరిట దేశంలోని 5,940 గ్రామాల్లో ఉన్న 69,455 కుటుంబాలు, 3,995 పట్టణాల్లో ఉన్న 47,006 కుటుంబాల ఆర్థిక స్థితిపై నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన సర్వే దేశంలోని రైతుల దీనస్థితిని వెల్లడించింది. దేశంలో ఒక్కో రైతు కుటుంబంపై సగటున లక్ష రూపాయల పైన రుణభారం ఉన్న రాష్ట్రాలు ఎనిమిది ఉంటే, వాటిలో దక్షిణాది నుంచే నాలుగు రాష్ట్రాలు ఉన్నాయి. ఇక రెండు తెలుగు రాష్ట్రాల రైతులు కూడా అప్పుల సుడిగుండంలో కూరుకుపోయారని ఇటీవల పార్లమెంటులో కేంద్ర వ్యవసాయశాఖమంత్రి ఇచ్చిన సమాచారంతో తేటతెల్లం అయ్యింది. దీని ప్రకారం, దేశవ్యాప్తంగా రైతుల రుణాలు రూ.31,34,807 కోట్లు కాగా, వీటిలో పంట రుణాలు రూ.16,34,219 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.15,00,588 కోట్లు. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల రుణాలు రూ.3,75,254 కోట్లు (పంట రుణాలు రూ.2,01,744 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.1,73,510 కోట్లు), తెలంగాణలో రూ.1,75,960 కోట్లు (పంట రుణాలు రూ.96,167కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.80,792కోట్లు). దేశంలోనే అత్యధికంగా రైతుల అప్పులున్న రాష్ట్రంగా తమిళనాడు మొదటి స్థానంలో నిలిస్తే, రెండు, ఏడు స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది.




ఎన్ఎస్ఎస్ఓ సర్వే నివేదిక ప్రకారం, జాతీయంగా సగటు రైతు కుటుంబ అప్పు రూ.74,121లు కాగా, సగటు నెలసరి వ్యవసాయ ఆదాయం రూ.10,218. అయితే అత్యంత వెనుకబడిన రాష్ట్రాలుగా చెప్పుకునే ఈశాన్య రాష్ట్రాలలో రైతు కుటుంబాల సగటు నెలసరి ఆదాయం రూ.16,863 కాగా, సగటు రుణభారం రూ.13,642 మాత్రమే. ఏపీలో రైతు కుటుంబాల సగటు నెలసరి ఆదాయం జాతీయ సగటు కన్నా 2.56శాతం (రూ.10,480) మేర ఎక్కువగా ఉన్నా, అప్పులు మాత్రం సుమారు మూడింతలు (రూ.2,35,554) అధికం. అదే సమయంలో తెలంగాణ రైతు కుటుంబాల ఆదాయం జాతీయ సగటు వ్యవసాయ ఆదాయం కంటే 7.9శాతం తక్కువగా ఉన్నా (రూ.9,403), అప్పులు దాదాపు రెండింతలు (రూ.1.52,000) అధికం. ఏపీలో 92.9శాతం, తెలంగాణలో 89.1శాతం రైతు కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయన్న సత్యం ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రైతుల దయనీయ ఆర్థిక స్థితికి నిదర్శనం. అనేక మంది రైతులు, కౌలురైతులు.. భారీగా పెరిగిన వ్యవసాయ అవసరాలకు సరిపడా రుణాలు బ్యాంకుల నుంచి పొందలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారస్థుల నుంచి అధిక వడ్డీలకు డబ్బు తీసుకుంటున్నారని ఎన్ఎస్ఎస్ఓ సర్వే వెల్లడించింది. ఇంత శ్రమించినా పంట దిగుబడి బాగా వస్తుందన్న నమ్మకం లేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతున్న పరిస్థితి. అన్నీ అనుకూలించి పంటలు పండినా ఒక్కోసారి మార్కెట్లో ధర ఉండదు. రైతుల చేతి నుంచి పంట వ్యాపారుల చేతికి వచ్చిన తరువాత, ధర ఆకాశాన్ని అంటుతోంది. ఇలా ధరల్లో స్థిరత్వం లేకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతో అప్పుల భారాన్ని మోయలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2023లో దేశవ్యాప్తంగా 10,700 మంది (4,690 మంది రైతులు, 6,096 మంది వ్యవసాయ కార్మికులు) వ్యవసాయదారులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఎన్సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. ఇది దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం ఆత్మహత్యలలో 6.3శాతం. రైతు ఆత్మహత్య కేసులు ఎక్కువగా మహారాష్ట్ర (38.5శాతం), కర్ణాటక (22.5శాతం), ఆంధ్రప్రదేశ్ (8.6శాతం), మధ్యప్రదేశ్ (7.2శాతం), తమిళనాడు (5.9శాతం)లలో నమోదయ్యాయి. 2021 నుంచి ప్రతి ఏడాది పదివేల మందికి పైగా వ్యవసాయదారులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది వ్యవసాయ రంగంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తున్నదని ఈ నివేదిక హెచ్చరించింది. వ్యవసాయానికి అత్యంత కీలకమైన రుణ సదుపాయం బ్యాంకుల ద్వారా అందించి అన్నదాతలను ప్రైవేటు వడ్డీ వ్యాపారస్థుల బారి నుంచి ప్రభుత్వాలు కాపాడాలి. సాగు ఖర్చు తగ్గేలా సహజ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు అధిక ఉత్పత్తినిచ్చే వంగడాలను అభివృద్ధి చేసి రైతులకు అందించాలి. పంటకు సరైన మద్దతు ధరను నిర్ణయించి, పటిష్ఠంగా అమలు చేయాలి. దళారీలపై ఆధారపడకుండా పంటను నేరుగా రైతులే అమ్ముకునేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించేలా పంటల బీమా అమలు చేయాలి. కేవలం వ్యవసాయం పైనే ఆధారపడకుండా పండ్లు, కూరగాయలు, పశుపోషణ, కోళ్ల పెంపకం వంటి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల వైపు రైతులను ప్రోత్సహించాలి. స్థిరమైన సాగునీటి వసతి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంటను నిల్వ చేసుకోవడానికి గోదాములు, కోల్డ్ స్టోరేజీలు తగినన్ని ఏర్పాటు చేయాలి. రైతులు ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేసుకుని తమ ఉత్పత్తులను విక్రయిస్తే అధిక ధర దక్కే అవకాశం ఉంటుంది. రుణమాఫీ అనేది తాత్కాలిక ఉపశమనం మాత్రమే కానీ దీర్ఘకాలిక పరిష్కారం కాదని, వ్యవసాయం లాభసాటి కావాలంటే రుణమాఫీలు, రైతు పథకాలు సరిపోవని.. పంటలకు సరైన ధర, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం, పంటల బీమాతోపాటు మార్కెట్ సంస్కరణలు కూడా చేపడితే సత్ఫలితాలు అందుతాయని వ్యవసాయరంగ నిపుణులు సూచిస్తున్నారు.

# పరిశోధనా భూముల జోలికి రాకండి!

నేటి అభివృద్ధి వేగం వ్యవసాయ పరిశోధనా సంస్థల భూముల పాలిట సమస్యగా మారుతున్నది. పాలకులు, అధికారులు అందరూ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలను భూములుగా మాత్రమే పరిగణిస్తూ వాటిని ఇతరత్రా అవసరాలకు వాడేందుకు సిద్ధమవుతున్నారు. పలు సందర్భాల్లో తాత్కాలిక ప్రయోజనం కోసం ఈ భూములను బలవంతంగానే తీసుకుంటున్నారు. బాపట్ల, రాజేంద్రనగర్, మారుటేరు, జగిత్యాల, నంద్యాల, కరీంనగర్, అనకాపల్లి, రుద్రూరు, తిరుపతి, నంద్యాల, రాగోలు, కూనారాం, సంగారెడ్డి, మల్లేపల్లి... ఇలా ఎన్నో ప్రాంతాలలోని పరిశోధనా క్షేత్రాలలో జరిగిన పరిశోధనలు, అక్కడ శోధించి సాధించిన పద్ధతులు, అభివృద్ధి అయిన వంగడాల ద్వారా ఎంతో సామాజిక అభివృద్ధి జరిగింది. ఉదాహరణకు బాపట్ల పరిశోధన కేంద్రం నుంచి వచ్చిన ధీరు 5204 గురించి ప్రపంచం అంతా తెలుసు. దీనిని ప్రామాణికంగా చేసుకుని రాజేంద్రనగర్ వారు తెచ్చిన డయాబెటిక్ రకం ఎంతో ప్రసిద్ధి పొందింది. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి పంటలోనూ ఈ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలు కాలానుగుణంగా రైతులోకానికి అందించిన వంగడాలు ఎన్నో ఉన్నాయి. వాణిజ్యపరంగా సాగుచేసే పత్తి, పసుపు, మిరప, చెరకు పంటలేగాక, కొబ్బరి, మామిడి, నిమ్మ, నేరేడు, జామ, అరటి, సీతాఫలం పండ్లలో కూడా ఈ క్షేత్రాలు మంచి ఫలితాలు అందించాయి. కానీ ఈ పరిశోధనా క్షేత్రాలకు చెందిన భూములను ప్రభుత్వాలు సాధారణ భూమిగా పరిగణిస్తూ కొందరు అధికార బలంతో చాలా సులువుగా ఆధీనపరచుకొని ఇతరత్రా సేవలకు వాటిని వినియోగిస్తున్నారు. భూముల ధరలకు రెక్కలు వచ్చిన ప్రాంతాల్లో వీటిని కేవలం రియల్ ఎస్టేట్ కోణంలోనే చూస్తున్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అభివృద్ధి చేసిన ఔషధ వనాలు పోయాయి. దశాబ్దాల తరబడి శ్రమించి, కోట్లాది రూపాయలు వెచ్చించి రూపొందించిన జీవ వైవిధ్య పార్క్ నేలమట్టం అయింది. కారణాలు ఏవైనా ఒక్కో పరిశోధన క్షేత్రం తన ఉనికిని కోల్పోతూ రావటం బాధాకరం.



ఇప్పుడు సరికొత్తగా 5204 వరి వంగడం పురుడుపోసుకున్న భూముల్లో బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామంటూ బోర్డు పెట్టారు. పాలకులు, అధికారులు అధికారంతో కాకుండా రైతు నేస్తాలుగా ఆలోచించాలి. మీరు నిర్మించే భవనాలు జీవం లేని కట్టడాలు. కానీ వీటి కోసం మీరు తీసుకునే వ్యవసాయ కళాశాల, విశ్వవిద్యాలయం, పరిశోధనా క్షేత్రాల భూములు కేవలం భూములు కావు. అవి జాతి జీవన రహదారులు. దేశం ఇంతవరకు సాధించిన ఆహార భద్రత, వ్యవసాయరంగంలో సాధించిన స్వయం పోషకత్వం ఈ భూముల్లో జరిగిన పరిశోధనల సారంతోనే సుసాధ్యమయింది. మరోవైపు, పెరుగుతున్న జనాభాకు సరిపడా తిండి గింజల ఉత్పత్తి జరగాలి. ఆహార భద్రతతో పాటు పోషకాహార భద్రతా కావాలి. దీనికి తోడు వాతావరణంలో వస్తున్న మార్పులు కలవరపెడుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావం తప్పదన్న నిపుణుల అంచనాకు అన్ని దేశాల వాతావరణ శాస్త్రజ్ఞులూ మద్దతు పలుకుతున్నారు. ఇటువంటి విపత్కర సమయంలో పరిశోధన క్షేత్రాలలో అధికార భవనాలు కట్టడం మంచిదేనా? అదే భూముల్లో పరిశోధనలు కొనసాగితే ఎన్నో సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుంది. గతాన్ని పరిశీలిస్తే జెన్నారెడ్డి రఘోత్తమరెడ్డి వంటి వారు తమ 150 ఎకరాల మామిడి తోటను పరిశోధనల కోసం విశ్వవిద్యాలయానికి దానం చేశారు. మల్యాల ప్రాంత అభివృద్ధిలో ఆ భూమిలో వచ్చిన పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం భాగస్వామ్యం ఎంతో ఉంది. భూముల విలువ పెరిగేకొద్దీ ఏర్పడే ముప్పును ముందుగానే ఊహించి డా. ఐవీ సుబ్బారావు విశ్వవిద్యాలయం భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేయించి కట్టుదిట్టం చేశారు. రాను రాను నిధుల కొరత, తదితర సమస్యలతో సాగుతున్న వ్యవసాయ కళాశాలలకు, పరిశోధన క్షేత్రాలకు భూములు కోల్పోవటం మరో పెద్ద సమస్యగా మారింది. దీనిని ఎదుర్కొనే శక్తి వాటికి లేదు. కేవలం ప్రభుత్వ దయా దాక్షిణ్యాల మీదనే అవి ఆధారపడి ఉన్నాయి. ఈ సమయంలో ప్రభుత్వాలు ముందు చూపుతో ఆలోచించాలి. వ్యవసాయ పరిశోధనలకు కేటాయించిన భూములను సంరక్షించే విధంగా ప్రత్యేక చట్టం తీసుకురావాలి

# ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ప్రతిభ..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్**

కమాన్ పూర్ మండలంలో కమాన్ పూర్, జూలపల్లి, రొంపికుంట గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కలవు. పదోవ తరగతి పలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా పదోవ తరగతిలో మండల స్థాయిలో రొంపికుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇటవేన ప్రణయ్ 569 మార్కులు సాదించి ప్రథమ స్థానంలో నిలువగా అదే పాఠశాలకు చెందిన అంకం ఐశ్వర్య 564 మార్కులు సాధించి ద్వితియ స్థానంలో, కమాన్ పూర్ పాఠశాలకు చెందిన అంజుమ్ సుల్తానాని 561 మార్కులు సాధించి తృతియ స్థానంలో నిలిచారు. కమాన్పూర్ పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత సాధించగా రొంపికుంట పాఠశాలలో 99 శాతం, జూలపల్లి పాఠశాలలో 99 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలల్లో చాల మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారు.

**రొంపికుంట పాఠశాలలో..**

రొంపికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 70 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఇటవేన ప్రణయ్ 569 మార్కులు, అంకం ఐశ్వర్య 564 మార్కులు, ఎం. అశ్విత 545 మార్కులు సాధించారు.

**కమాన్ పూర్ పాఠశాలలో..**

కమాన్ పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతిలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అంజూమ్ సుల్తానా 561 మార్కులు, అక్షయ 553 మార్కులు, సాహితి 548 మార్కులు సాధించారు.

**జూలపల్లి పాఠశాలలో..**

జూలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థులు పదోవ తరగతి పరీక్షలు రాయగా 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కుమ్మం రిషిత 551 మార్కులు, బొజ్జ మణి చరణ్ 538 మార్కులు, వైద్య శ్రీహిత 528 మార్కులు సాధించారు.

## ముర్మూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రైతులకు మద్దతు ధర, నేరుగా విక్రయ సౌకర్యం**
**: మనాలి ఠాకూర్**

**అగ్ని ధార న్యూస్ ,(అంతర్గాం):**

అంతర్గాం మండలంలోని ముర్మూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర అందించడంతో పాటు మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ప్రభుత్వానికి వడ్లు విక్రయించే సౌకర్యం కల్పించడమే కేంద్రం ప్రధాన లక్ష్యమన్నారు. రైతులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం పొందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు సమయానికి చెల్లింపులు అందడం, రవాణా సౌకర్యాలు మెరుగుపడడం, ధాన్యం నిల్వ సమస్యలు తగ్గడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. రైతుల ఆదాయం పెరగడం, జీవన ప్రమాణాలు మెరుగుపడడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## సర్పంచ్ కు పరామర్శ



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

గొల్లపల్లి సర్పంచ్ శిలారపు మల్లయ్యకి కంటి శస్త్రచికిత్స జరిగిన సందర్భంగా, పరామర్శించి ఆరోగ్య తెలుసుకున్న- కమాన్ పూర్ ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్, జూలపల్లి ఉపసర్పంచ్ రాజ్ మహేందర్,నాగారం ఉపసర్పంచ్ వోడ్నాల శ్రీనివాస్, సిద్ధిపల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాల మహేష్ గౌడ్,ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు మల్యాల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారహ స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ విజయరమణారావు సతీమణి



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్ పూర్ : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ ఆదివారహ స్వామిని బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు సతీమణి పావని, వారి కూతురు వైష్ణవి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్ వారిని శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామానుజచార్యులు, ఇనగంటి మురళి మనోహర్ రావు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక

**న్యూ ఢిల్లీ :** ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక చేశారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్య మార్గంలో త్వరితగతిన పరిష్కారం లభించకుంటే అమెరికా కఠిన వైఖరిని తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈమేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు. ట్రంప్ అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకున్న సీన్‌తో పాటు 'నో మోర్ మిస్టర్ నైస్ గై' (ఇకపై మంచివాడిలా ఉండను) నినాదం కలిగిన ఫొటోను తన పోస్ట్‌కు జతపరిచారు. ఇరాన్-అమెరికా చర్చల ప్రక్రియలో వేగం లోపించడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ కలిసికట్టుగా నిర్ణయాలను తీసుకోలేకపోతోందని ఆయన మండిపడ్డారు. అమెరికాతో ఒప్పందాన్ని ఖరారు చేసే సమర్ధత ఇరాన్ పాలకుల్లో లేదని విమర్శించారు.

## మేర మహిళలకు కుట్టుమిషన్లలో అధిక వాటా ఇవ్వాలి

**బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర మేర టైలర్ సంక్షేమ సంఘం వినతి**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో మేర మహిళలకు అధిక శాతం కేటాయించాలని రాష్ట్ర మేర టైలర్ వృత్తి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి సంఘ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం కుట్టుమిషన్ల పంపిణీలో మేర మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో టైలర్ వృత్తిని ప్రధాన జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న మేర మహిళలకు ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాజం ఆధ్వర్యంలో కీర్తి జయంత్, గూడూరు ప్రభాకర్, గూడూరు లవన్ కుమార్, రామగిరి సుధాకర్, మునిగాల శ్యాంప్రసాద్ తదితరులు మంత్రిని కలిసి సమస్య వివరించారు. వినతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందించి మేర మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మేర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు మేడే స్ఫూర్తితో ఉద్యమాలు

**మే తొలి వారంలో సింగరేణి సమస్యలు పరిష్కరించాలి.**
**ఏఐటియుసి హెచ్చరిక**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం మేడే స్ఫూర్తితో నిరంతర ఉద్యమాలు చేపడతామని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ తెలిపారు. బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల పని గంటలు పెరగడం, యూనియన్ హక్కులు బలహీనపడటం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో, సింగరేణిలో ఈ కోడ్‌ల అమలును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో అమలులో ఉన్న కార్మిక చట్టాలను కొనసాగించాలని కోరారు. మేడే సందర్భంగా లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.

**సింగరేణి సమస్యలపై సమ్మె హెచ్చరిక**

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను మే తొలి వారంలోగా పరిష్కరించకపోతే అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. గత ఏడాది నుంచి మెడికల్ బోర్డు నిలిపివేయడంతో వేలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని, మారుపేర్ల విజిలెన్స్ కేసుల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ యాజమాన్యమే భరించాలని, స్వంత ఇంటి పథకం అమలు చేయాలని, తొలగించిన కార్మికులకు మరో అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వీడి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, లేకుంటే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌తో పాటు గోసిక మోహన్, ఎం.ఎ. గౌస్, బిట్టి వెంకటేశ్వర్లు, తొడుపునూరి రమేశ్‌కుమార్, పడాల కనకరాజు, బూడిద మల్లేష్, చెప్యాల మహేందర్‌రావు, మీసాల మల్లయ్య, కోడూరి మునీందర్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భరోసా బృందం అవగాహన సదస్సు

**మంథని, సుల్తానాబాద్ మండల కార్యాలయాల్లో కార్యక్రమం**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (90 రోజుల కార్యాచరణ)లో భాగంగా భరోసా బృందం ఆధ్వర్యంలో మంథని, సుల్తానాబాద్ మండల అభివృద్ధి కార్యాలయాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. సదస్సులో మహిళలు, బాలికలను మోసగించే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాగ్రత్తగా వ్యవహరిస్తే అనేక నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. లింగ వివక్ష లేకుండా పిల్లలను పెంచాలని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న దాడులపై ప్రజలకు అవగాహన కల్పించారు.మాదక ద్రవ్యాల వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ మోసాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని వివరించారు. తెలియని నంబర్ల నుంచి మహిళలకు ఇబ్బందులు కలిగించినా, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, పని ప్రదేశాల్లో వేధింపులు చేసినా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. భరోసా కేంద్రం ద్వారా మహిళలు, పిల్లలకు అందిస్తున్న సేవలు, రక్షణ చర్యలు, పోక్సో చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఇన్‌చార్జి ఉప నిరీక్షకురాలు ఎం. లావణ్య, సమన్వయకర్త-కౌన్సిలర్ కె. ఆశ్రిత, సహాయక సిబ్బంది ఎం.డి. ఆస్మా, స్వాతి, ఏఎన్ఎం వి. భారతి తదితరులు పాల్గొన్నారు.

## హృదయ శ్వాస పునరుద్ధరణపై అవగాహన

**కొడంగల్ :** సిపిఆర్ పై అవగాహన కార్యక్రమంను బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల యందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లిల్లీ మేరి కార్డియోపల్మనరీ రిసక్టేషన్ (సి. పి. ఆర్) పై మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏటా లక్షమందిలో 4,280 మంది సడెన్ కార్డియాక్ అరెస్టుతో మరణిస్తున్నారని, వీటి శాతాన్ని తగ్గించేందుకు సిపిఆర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లిల్లీ మేరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లిల్లీ మేరి మాట్లాడుతూ హఠాత్తుగా కుప్పకూలటం, అపస్మారక స్థితికి వెళ్లడం, శ్వాస అందకపోవడం, నాడీ కొట్టుకోకపోవడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు గుండెపోటుకు దారితీస్తాయని, సడన్ కార్డియాక్ అరెస్టుకు గురైతే రెండు చేతులతో సిపిఆర్ ప్రక్రియ చేపట్టి బతికించవచ్చన్నారు. బలముగా, వేగముగా ఛాతి మధ్యలో నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఐదు సెంటీమీటర్ల లోతులో మర్దన చేయడాని సిపిఆర్ అంటారన్నారు.

## నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

**సిమెంట్ బస్తాలు అందజేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలశీ లోని లింగరావు పల్లి గ్రామ పంచాయతీ కీ చెందిన బొచ్చుపల్లి యాదయ్య తండ్రి జంగయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం జరిగింది.స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి ఇంటి నిర్మాణానికి సిమెంటు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపడం జరిగింది.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు

**మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**
**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆమనగల్ మండల నిరుద్యోగ యువతీ యువకులకు సువర్ణ అవకాశం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మరియు తెలంగాణ రాష్ట్ర సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన రాష్ట్ర ఫేమ్ ఫ్యాకల్టీ టీం విశ్వ అకాడమీ వారి సహకారంతో ఎస్సై కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు నేడు ఏప్రిల్ 30 నుండి ప్రారంభం కానున్నాయి వీరి కోచింగ్ ప్రత్యేకతలు రాష్ట్రస్థాయి అత్యుత్తమ అధ్యాపక బృందం ప్రతిరోజు 9 గంటల పాటు శిక్షణ రోజువారీ టెస్టులు ఒ వారంతర గ్రాండ్ టెస్టులు నూతన సిలబస్ కు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు నాన్ గణితం విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఆమనగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కోచింగ్ సెంటర్ ను నిర్వహించనున్నారు కావున ఆమనగల్ మండల యువతీ యువకులు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగం పొందాలనే పట్టుదలతో మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోగలారని తెలియజేశారు ఇంకా! మీకేమైనా సందేహాలు ఉంటే 9440 231537, 9666336052 నెంబర్స్ ని సంప్రదించగలరుని కోరారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మెరిసిన మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల బాలురు...

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో మొదటి బ్యాచ్ అయిన పదవ తరగతి విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాలలో 70 మంది విద్యార్థులకు గాను 70 మంది ఉత్తీర్ణత సాధించి 100% ఉత్తీర్ణత తో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభంజనం సృష్టించడం జరిగింది. వీరిలో ప్రథమ, ద్వితీయ ,తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు: ఎం. అశ్విత్ గౌడ్(566/600), ఏ. ప్రమోద్ యాదవ్(561/600) , కే. వంశీ(558/600). వీరితో పాటుగా ఇంకా 30 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం అభినందించడం జరిగింది.

## పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షల తెలిపిన సర్పంచ్

**తలసాని కృష్ణారెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలం ,మార్చాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులు100% ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.26 మంది విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించడం జరిగింది అశ్విని 564, యాస్మిన్ బేగం 562,సాయి శ్లోక 555,మొదటి మూడు స్థానాలు సాధించడం జరిగింది. విద్యార్థులకు 100% ఉత్తీర్ణత సహరించిన తల్లిదండ్రులకు , పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు అందరికీ ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మీరు ఎంచుకున్న రంగాల్లో మరిన్ని విజయాల సాధించాలని ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మేడే జయప్రదం చేయాలి

**ఏఐటీయూసీ హెచ్-64 కేటీపీపీ రీజినల్ అధ్యక్షుడు కోల శ్యామ్ పిలుపు**

**అగ్నిధార న్యూస్,( భూపాలపల్లి):**

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 141వ మేడేను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ హెచ్-64 కేటీపీపీ రీజినల్ అధ్యక్షుడు కోల శ్యామ్ కార్మికులకు పిలుపునిచ్చారు.మేడే సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగోలో 8 గంటల పనిదినం కోసం జరిగిన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన కార్మికుల స్ఫూర్తితో ప్రపంచ కార్మిక వర్గం ప్రతి సంవత్సరం మేడేను జరుపుకుంటుందని తెలిపారు. ఉద్యమాల ద్వారానే కార్మికులు హక్కులు సాధించుకున్న చారిత్రక సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, హక్కుల కోసం అమరులైన కార్మికులను స్మరించుకోవడమే మేడే ఉద్దేశమని పేర్కొన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించివేసిందని విమర్శించారు. కార్మికులు సమ్మె చేయడాన్ని నేరంగా చూపిస్తూ జైలుకు పంపే కుట్రలతో ఈ చట్టాలు రూపొందించబడినట్లు ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ మేడేను ఐక్యంగా, ఘనంగా నిర్వహించాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా చిన్నారుల చెవులుకుట్టు వేడుకలు

**ఆశీర్వదించిన డాక్టర్ దుర్గం నగేష్ దంపతులు**

**అగ్ని ధార న్యూస్, (రామగుండం):**

స్థానిక ఎన్టీపీసీ పరిధిలోని సాలెపల్లె గ్రామానికి చెందిన పూజ--సదానందం దంపతుల కుమార్తెలు సమీక్ష, మనుల చెవులకుట్టు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్, ఆయన సతీమణి ప్రమీల హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. డాక్టర్ నగేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని అన్నారు.మంచి విద్యాభ్యాసంతో తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆశీర్వదించారు.వేడుకలకు బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పదిలో నోబెల్ ప్రభంజనం

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి పెద్దకల్వల**

ప్రముఖ విద్యాసంస్థ నోబెల్ హై స్కూల్, పెద్దకల్వలలో డాక్టర్ మోహన్ రాజ్ ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రణీత ఆధ్వర్యంలో నోబెల్ పాఠశాల విద్యార్థులు 2026 సంబంధించిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి అద్భుత ఫలితాలను సాధించారు.

పాఠశాల నుండి పరీక్షలకు హాజరైన మొత్తం 51 మంది విద్యార్థుల్లో 51 మంది ఉత్తీర్ణత సాధించి, 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు గర్వకారణంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ మోహన్ రాజా ఒక ప్రకటనలో హర్ష వ్యక్తం చేశారు., విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు అన్నారు. ఈ విజయోత్సవ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సిబ్బంది తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు:
తేజస్విని -- మొదటి ర్యాంక్ 589 మార్కులు
శ్రీ వైష్ణవి -- రెండవ ర్యాంక్ 583 మార్కులు సాధించారని అన్నారు.

**ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ:**

పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ నైతిక విలువలను అందించడమే మా ప్రధాన లక్ష్యం. ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్ల ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ ఈ విజయాన్ని సాధించారు" అని తెలిపారు. "విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, యాజమాన్యం ప్రోత్సాహం కలిసి ఈ విజయానికి ప్రధాన కారణమయ్యాయి" అని అన్నారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులకు పాఠశాల




యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసింది. అలాగే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాలలో కొత్త కార్యక్రమాలు చేపట్టనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

# పది ఫలితాలు విడుదల



జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద

**జిల్లాలో 97.70 శాతం ఉత్తీర్ణత నమోదు.. రాష్ట్రస్థాయిలో 16వ స్థానం.**

**అగ్నిధారన్యూస్ ?పెద్దపల్లి, ఏప్రిల్-29:**

జిల్లాలో 2026 పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?మార్చి 14 నుండి ఏప్రిల్ 15 వరకు జరిగిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాల్లో మొత్తం 7,488 మంది విద్యార్థులు (బాలురు 3674, బాలికలు 3814) హాజరుకాగా, వారిలో 7,316 మంది (బాలురు 3566, బాలికలు 3750) ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.దజిల్లాలో 97.70 శాతం ఉత్తీర్ణత నమోదైందని, రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి జిల్లా 16వ స్థానాన్ని కైవసం చేసుకుందని ఆమె వెల్లడించారు. ?పదవ తరగతి ఫలితాల సాధనలో కృషి చేసిన ప్రధానోపాధ్యాయులకు, విషయ బోధన ఉపాధ్యాయులకు, పాఠశాల విద్యాశాఖ సిబ్బందికి జిల్లా విద్యాశాఖాధికారి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## డ్రగ్స్‌కు దూరంగా.. చదువుకు దగ్గరగా ఉండాలి

**ఆదిలాబాద్ :** బాలల రక్షణ, వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా టీనేజ్ గర్భాల నివారణ, ఎలోప్‌మెంట్, డ్రగ్స్ నివారణ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత "డ్రగ్స్‌కు దూరంగా – చదువుకు దగ్గరగా" ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీనేజ్ గర్భాలు, బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని, ఇలాంటి అనర్థాలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలు, కేసుల బారిన పడకుండా పాఠశాలల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలల కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, రిమ్స్ డైరెక్టర్.డా.జైసింగ్ రాథోడ్, డా. సాధన,ప్రిన్సిపల్ లలిత, ఇతర అధికారులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో చలివేంద్రం ప్రారంభం

**నిర్మల్-భైంసా :** వేసవి వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించే ఉద్దేశంతో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ రావుల సువర్ణ పోశెట్టి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు చల్లని తాగునీరు అందించడం సేవా కార్యక్రమాల్లో అత్యంత ముఖ్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి,కౌన్సిలర్లు,స్థానిక నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ :** ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణా సహా పలు రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు, రవాణాను అరికట్టాలన్నారు. అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నియంత్రణ ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుక అమ్మకాలు జరగాలని అన్నారు. ఇసుక అక్రమ త్రవ్వకాలు, రవాణా నియంత్రణపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భూభారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కు సంబంధించి ఓటర్ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ఆక్విజిషన్ నాయక్వాడి జల కుమారి, సిపిఓ జీవరత్నం, ఏడి మైన్స్ హరి ప్రసాద్, ఏడి ల్యాండ్ సర్వేయర్ నరసింహ మూర్తి, తహసిల్దార్ లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాకు సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.

**నిర్మల్ :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువతకు ఉద్యోగ కల్పన కొరకు ఏర్పాటు చేసిన జాబ్ మేళా గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో, బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీన ఆదిలాబాద్ లో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాలో అర్హులైన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చునని అన్నారు. పోస్టర్ లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లేదా వెబ్ సైట్ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చునని అన్నారు. నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో 100% ఉత్తీర్ణత

**హనుమకొండ :** పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 5731 ప్రభుత్వ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత సాధించి కార్పొరేటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సత్తా చాటారు. ఆరు పాఠశాలల్లో ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేదు ఈ ఆరు పాఠశాలలు కూడా ప్రైవేట్ స్కూల్స్ కావడం అనేది గమనా ర్హం . దీన్నిబట్టి ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్ కన్నా ప్రభుత్వ పాఠశాలలు మెరుగు అని 100% నిరూపించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ములుగు జిల్లా 99. 30% రాష్ట్రంలోనే టాప్ లో నిలువగా హైదరాబాద్ జిల్లా 89.23% అట్టడుగు స్థానంలో ఉన్నది. హనుమకొండ జిల్లా ప్రభుత్వ మర్కాజి హైస్కూల్లో 154 మంది పరీక్ష వ్రాయగా 151 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. హనుమకొండ జిల్లా మర్కాజి హై స్కూల్ జిల్లాలోనే ఫస్ట్ ర్యాంకు సాధించి స్కూలు పేరును గత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసిపోయి బోధన క్రమశిక్షణ తో జిల్లాకే పేరు తెచ్చి పెట్టారు. ఈ ఫలితాలతోనైనా జిల్లా నడిబొడ్డున ఉన్నప్పటికీ అత్యధిక విద్యార్థులు ఈ స్కూల్లోనే ఉన్నప్పటికీ వసతులలేమి చాలా తీవ్రంగా ఉంటున్నది పలుమార్లు జిల్లా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉన్నది జిల్లాకే టాపర్గా వచ్చిన ఈ స్కూలుకు ఈ 2026 ,27 సంవత్సరంలోనైనా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రానికే వన్నె తెచ్చే విధంగా విద్యార్థులు ర్యాంకులు తెచ్చుకుంటామని చెప్పారు. మర్కాజి హై స్కూల్ టాపర్ గా కె సిరి చందన 579 మార్కులు సాధించగా పి శివాని 532 శ్రద్ధ 528 మార్కులు సాధించినారు. 14 మందికి 500 కు పైగా మార్పులు వచ్చాయి. విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జి.వి.రామారావు అందరి సహకారంతో జిల్లాలోనే టాపర్గా రాగలిగామని రాబోయే రోజులలో కూడా అందరి సహకారం తో ముందుకు పోతామని హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. వరంగల్ జిల్లా క్రిష్ణ కాలనీ హైస్కూల్లో 105




మంది పరీక్ష రాయగా 99 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు 500కు పైగా మార్కులు 25 మంది విద్యార్థులు సాధించినారు .589 మార్కులు సాధించి వరంగల్ జిల్లా టాపర్ గా నిలిచింది. 94.28 పర్సెంటేజ్ ఫలితాలు సాధించినారు. మట్టెవాడ హైస్కూల్లో 84. 6% ఉత్తీర్ణత సాధించారు. 26 మంది పరీక్షరాయగా 22 మంది ఉత్తీర్ణులైనారు . జి నాగ వైష్ణవి 517 మార్కులు సాధించి స్కూల్ టాపర్గా నిలిచింది. సోమిడి ప్రభుత్వ పాఠశాలలో 19 మంది పరీక్ష వ్రాయగా 18 మంది ఉత్తీర్ణులైనారు. శాయంపేట ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో 46 మంది పరీక్ష వ్రాయగా 42 మంది ఉత్తీర్ణులైనారు. తెలుగు హిందీ సైన్స్ సోషల్ లో 100% మార్కులు సాధించారు. 544,507,505 మార్కులతో స్కూల్ టాపర్ గా నిలిచారు. గిర్మాజిపేట హైస్కూల్లో 25 మంది విద్యార్థులలో 450 నుండి 500 మార్కులు రాగా, పదిమంది విద్యార్థులకు 400 నుండి 450 మార్కులు సాధించారు. వడ్డేపల్లి హైస్కూల్లో 30 మంది పరీక్ష వ్రాయగా 29 మంది ఉత్తీర్ణులైనారు. స్కూల్ టాపర్ గా 575 ,559,535 మార్కులతో ముగ్గురు విద్యార్థులు సాధించారు. పెట్రోల్ పంప్ హైస్కూల్లో 27 మంది పరీక్ష వ్రాయగా 24 మంది ఉత్తీర్ణత సాధించారు .తెలుగు, హిందీలలో 100% మార్కులు రాగా మాథ్స్ ,సైన్స్ లో 96 శాతం,ఇంగ్లీషులో 92 శాతం, సోషల్ లో 100% మార్కులు 24 మంది విద్యార్థులు సాధించినారు.

# సిద్దిపేట పోలీస్ విభాగంలో క్రమశిక్షణే ప్రధానం





**సిద్దిపేట :** సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమంపని ప్రదేశాల్లో వేధింపులను ఏమాత్రం సహించంమహిళా హక్కులు, చట్టాలపై అవగాహన.సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో జెండర్ సెన్సిటైజేషన్ లింగ వివక్షత-వగాహన అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమం ప్రారంభంలో 'షీ టీమ్స్'ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణపై రూపొందించిన పలు అవగాహన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం మహిళా పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్ దుర్గ మాట్లాడుతూ.సమాజంలో మరియు పని ప్రదేశాల్లో లింగ సమానత్వం ఎంత ముఖ్యమో వివరించారు.ఈ సందర్భంగా హాజరైన న్యాయవాది రియాజుద్దీన్ మాట్లాడుతూ. పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపులకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలు, మహిళా హక్కులు పై సమగ్ర అవగాహన కల్పించారు.ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ. పోలీస్ విభాగం అత్యంత క్రమశిక్షణతో కూడిన విభాగం. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ ను పాటించాలి. పని ప్రదేశాల్లో మహిళా సిబ్బంది పట్ల వేధింపులను ఏమాత్రం సహించబోమని,ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తోటి సిబ్బందితో మాట్లాడేటప్పుడు ఎంతో మర్యాదగా, గౌరవంగా ప్రవర్తించాలి. విధి నిర్వహణలో ఒకరిపై ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేయకూడదు.

## బిజినెస్

### ఇంధన దాహం.. జల వినాశం!



భారతదేశం ఇంధన స్వయంసమృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపి విదేశీ ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. అయితే, ఈ గ్రీన్ ఎనర్జీ ప్రస్థానం దేశాన్ని మరో పెను ప్రమాదంలోకి నెట్టేస్తోందా? అనే ప్రశ్న ప్రస్తుతం పర్యావరణవేత్తలను వేధిస్తోంది. ఒక లీటరు ఇథనాల్ తయారీకి దాదాపు 10,000 లీటర్ల నీరు ఖర్చవుతోందన్న వాస్తవం ఇప్పుడు దేశ జల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.

**బియ్యం నుంచి ఇంధనం**

ప్రభుత్వం 2024–25లో ఇథనాల్ ఉత్పత్తి కోసం 52 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించింది. రాబోయే 2025–26 నాటికి ఈ లక్ష్యాన్ని 90 లక్షల టన్నులకు పెంచాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించి ఆహార సరఫరా శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందే విరిగిన బియ్యం వాటాను 25% నుంచి 10%కి తగ్గించనున్నారు. దీనివల్ల మిగిలిన బియ్యాన్ని నేరుగా ఇథనాల్ తయారీ డిస్టిలరీలకు మళ్లిస్తారు. అయితే, ఆహార భద్రత కంటే ఇంధన అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వడంపై కొంత విమర్శలు వ్యక్తమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**నీటి వినియోగం గణాంకాలు ఇలా..**

ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా ఇటీవల వెల్లడించిన గణాంకాల ప్రకారం, ఇథనాల్ తయారీకి పంటల వారీగా నీటి వినియోగం కింది విధంగా ఉంది.

| పంట రకం | ఒక లీటరు ఇథనాల్‌కు అవసరమయ్యే నీరు |
|---|---|
| బియ్యం (వరి) | 10,790 లీటర్లు |
| మొక్కజొన్న | 4,670 లీటర్లు |
| చెరకు | 3,630 లీటర్లు |

ఒక కిలో బియ్యం పండించడానికి సుమారు 3,000 లీటర్ల నీరు అవసరమైతే ఒక టన్ను బియ్యం నుంచి కేవలం 470 లీటర్ల ఇథనాల్ మాత్రమే లభిస్తుంది. అంటే, మనం వాహనాల్లో వాడే ఇంధనం ఎంత భారీ స్థాయిలో జల వనరులను హరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, 2030 నాటికి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై సహా 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు నిండుకునే ప్రమాదం ఉంది. ఇటువంటి తరుణంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లోనే ఇథనాల్ ప్లాంట్లు కేంద్రీకృతమవ్వడం గమనార్హం. మహారాష్ట్రలోని విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో తాగునీటికే కటకటలాడుతున్న స్థితిలో అక్కడ 396 కోట్ల లీటర్ల ఇథనాల్ సామర్థ్యం గల ప్లాంట్లు ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్, కర్ణాటకలో కూడా భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రాంతాల్లోనే ఇథనాల్ తయారీ జోరుగా సాగుతోంది. ఇథనాల్ మిల్లులు విడుదల చేసే వినాస్సే (ఎఱఅఖుంంవ) అనే వ్యర్థ జలాలు భూమిలోకి చేరితే భూగర్భ జలాలు, ఉపరితల జలాలు పూర్తిగా కలుషితమవుతాయని కొందరు చెబుతున్నారు. ఒకప్పుడు పంజాబ్, హరియాణా వంటి ప్రాంతాల్లోని రైతులు వరి పండించి భూగర్భ జలాలను తోడేస్తున్నారని విమర్శించిన వ్యవస్థే ఇప్పుడు అదే ధాన్యాన్ని పారిశ్రామిక స్థాయిలో గ్రీన్ ఎనర్జీ పేరుతో ఇంధనంగా మారుస్తోంది. పర్యావరణాన్ని కాపాడటం కోసం చేస్తున్న ఈ ప్రయత్నం భవిష్యత్తులో దేశాన్ని మంచినీటి చుక్క కోసం అల్లాడేలా చేసేలా ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. క్లీన్ ఎనర్జీ లక్ష్యం గొప్పదే అయినా అది దేశ జల వనరులను బలిపెట్టేదిగా ఉండకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తయారీ రంగం కుదేలు



**న్యూఢిల్లీ :** దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధిరేటు గత నెలలో 5 నెలల కనిష్ఠానికి పతనమైంది. మార్చిలో 4.1 శాతానికే పరిమితమైంది. తయారీ రంగంలో ప్రగతి మందగించడమే ఇందుకు కారణమని మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. ఇక అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీరసించిన విద్యుత్తు రంగం కూడా ఐఐపీ వృద్ధికున్న అవకాశాలను దెబ్బతీసింది.

**నిరుడు అక్టోబర్ తర్వాత..**

గత ఏడాది అక్టోబర్‌లో ఐఐపీ వృద్ధిరేటు 0.5 శాతంగానే ఉన్నది. మళ్లీ ఆ తర్వాత ఈ ఏడాది మార్చిలోనే తక్కువగా నమోదైంది. అంతకుముందు నెల ఫిబ్రవరిలో 5.1 శాతంగా ఉన్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) లెక్కలు చెప్తున్నాయి. నిజానికి మొదట్లో 5.2 శాతంగా దీన్ని అంచనా వేశారు. ఆ తర్వాత సవరించారు. అయినప్పటికీ నెల రోజుల్లో 1 శాతం వృద్ధి క్షీణించినైట్టెంది. ఇక నిరుడు మార్చిలో ఐఐపీ ప్రగతి 3.9 శాతంగా ఉన్నది. దీన్నిబట్టి చూస్తే ఏడాది కాలంలో స్వల్పంగానే పెరిగినైట్టెంది. ఇదిలావుంటే ఐఐపీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగం కార్యకలాపాలు ఈ మార్చిలో 4.3 శాతం వృద్ధిని చూపుతున్నాయి. మొత్తం 23 ఇండస్ట్రీ గ్రూపుల్లో 9 ప్రతికూల వృద్ధిలోనే ఉన్నాయి. అలాగే విద్యుత్తు రంగంలో వృద్ధిరేటు 7.5 శాతం నుంచి 0.8 శాతానికి దిగజారింది. దీంతో తయారీ రంగం కార్యకలాపాలు పెద్దగా పెరుగకపోవడం, విద్యుత్తు రంగం మందగమనం దిశగా నడువడం.. ఐఐపీ వృద్ధిని ప్రధానంగా అడ్డుకున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మైనింగ్ రంగంలో ఉత్పాదకత 1.2 శాతం నుంచి 5.5 శాతానికి ఎగసినా ఫలితం లేకపోయిందని అంటున్నారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2025–26) మొత్తంగా చూసినైట్టెతే ఐఐపీ వృద్ధి స్వల్పంగా పెరిగింది. 4.1 శాతంగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2024–25) ఇది 4 శాతంగా ఉన్నట్టు తాజా గణాంకాలు చెప్తున్నాయి.

**యుద్ధం ప్రభావం..**

గల్ఫ్ యుద్ధం.. భారత్‌ను గట్టిగానే ప్రభావితం చేస్తున్నది. దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. అందులో ఎక్కువ భాగం సౌదీ, ఖతార్, కువైట్, యూఏఈ తదితర మిడిల్ ఈస్ట్ దేశాల నుంచే వస్తున్నది. అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో ఆయా దేశాల్లో ముడి చమురు, గ్యాస్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అమెరికాకు అండగా ఉంటున్నాయని ఇరాన్ పొరుగు దేశాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నది. ఇప్పటిదాకా జరిగిన దాడుల్లో ఆయా దేశాల్లోని చమురు ఉత్పాదక కేంద్రాలు తీవ్రంగానే దెబ్బతిన్నాయి. దీనికితోడు హెర్మూజ్ జలసంధిలో రవాణాకు ఇబ్బందులు తలెత్తడం.. భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని తెచ్చిపెడుతున్నది. డిమాండ్‌కు తగ్గ చమురు, సహజ వాయువు సరఫరా లేక.. అనుబంధ రంగాలు కుదేలవుతున్నాయి. పెరిగిన రవాణా వ్యయంతో వివిధ వస్తూత్పత్తుల తయారీ ఖర్చులు పెరిగి.. మార్కెట్‌లో అమ్మకాలను దెబ్బతీస్తున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. ఉత్పాదక రంగంలో అన్నింటికీ ఆయిల్ జీవనాధారం కావడంతో.. మందగమనం ఛాయలు అలుముకున్నాయి. మొత్తానికి 2 నెలలుగా జరుగుతున్న వార్ (ఈ ఏడాది ఫిబ్రవరి 28న మొదలైంది)తో భారతీయ వ్యాపార, పారిశ్రామిక రంగాలు దిగాలుపడ్డాయి.

## ఒపెక్ నుంచి యూఏఈ ఔట్.. భారత్‌కు మేలే!

అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ముడిచమురు ఉత్పత్తి చేసే దేశాల కూటమి 'ఒపెక్' నుంచి వైదొలుగుతున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ పరిణామం చమురు ధరలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే ఆందోళనల మధ్య భారతదేశం తన ఇంధన వనరులపై దృష్టి సారించాలని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన 'ది ఎకనామిస్ట్ ఇంపాక్ట్ రెసిలెంట్ ఫ్యూచర్స్ సమ్మిట్'లో ఆయన ప్రసంగిస్తూ గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్‌కు ఇది సానుకూల పరిణామంగా మారే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. 1960లో ఏర్పాటైన ఒపెక్ అంతర్జాతీయంగా చమురు ధరలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం 12 దేశాల సభ్యత్వం ఉన్న ఈ కూటమిలో యూఏఈ 1967 నుంచి (మొదట అబుదాబిగా, తర్వాత 1971 నుంచి యూఏఈగా) కీలక భాగస్వామిగా ఉంది. మే 1 నుంచి యూఏఈ ఈ కూటమి నుంచి వైదొలుగుతుందన్న నిర్ణయం చమురు సరఫరా, ధరలపై ఒపెక్‌కు ఉన్న పట్టును బలహీనపరిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 'యూఏఈ నిర్ణయం ప్రపంచ చమురు మార్కెట్లను అతలాకుతలం చేస్తుందా లేదా స్థిరీకరిస్తుందా అనేది కాలమే నిర్ణయిస్తుంది. అయితే, భారత్–



యూఏఈల మధ్య ఉన్న అసాధారణ భౌగోళిక రాజకీయ సంబంధాలు, నాయకత్వాల మధ్య ఉన్న పరస్పర నమ్మకం దృష్ట్యా ఇది భారత్‌కు మేలు చేస్తుందని భావిస్తున్నాను' అని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ అన్నారు. యూఏఈ తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాల కోసం ఒపెక్ నుంచి బయటకు వచ్చినప్పటికీ మార్కెట్‌ను ఒక్కసారిగా ప్రభావితం చేసే అవకాశం లేదు. క్రమంగా చమురు ఉత్పత్తిని పెంచడం ద్వారా తన మార్కెట్ వాటాను పెంచుకోవాలని యూఏఈ భావిస్తోంది. ఈ అనిశ్చితి కాలంలో దేశీయంగా ఇంధన వనరులను బలోపేతం చేసుకోవడమే భారత్‌కు అత్యంత కీలకమైన రక్షణ కవచం.

# ముంబై ఆటగాళ్లు నల్ల బ్యాండ్లు ఎందుకు ధరించారో తెలుసా..?



ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఇవాళ (ఏప్రిల్ 29) జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఆటగాళ్లు నల్ల బ్యాండ్లు ధరించి బరిలోకి దిగారు. దీని వెనుక ఓ హృదయ విదారక కారణం ఉంది. జట్టు సహాయక సిబ్బందిలో ఒకరి కుమార్తె ఇటీవల అకాల మరణం చెందింది. ఆమె స్మారకార్థం, అలాగే ఆ కుటుంబానికి సంఘీభావం తెలియజేయడానికి ఆటగాళ్లు నల్ల ఆర్మ్‌బ్యాండ్లు ధరించి మైదానంలోకి దిగారు. ఈ విషాద సమయంలో ఆ కుటుంబ గోప్యతను గౌరవిస్తూ, సంబంధిత సిబ్బంది వివరాలను ముంబై ఇండియన్స్ వెల్లడించలేదు. ఇదిలా ఉంటే, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తున్న ముంబై ఇండియన్స్ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. 15 ఓవర్ల అనంతర?ం ఆ జట్టు స్కోర్ 181–3గా ఉంది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ 44 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 100 పరుగులు చేసి క్రీజ్‌లో ఉన్నాడు. అతనికి జతగా హార్దిక్ పాండ్యా (2) క్రీజ్‌లో ఉన్నాడు. అంతకుముందు విల్ జాక్స్ 46, సూర్యకుమార్ యాదవ్ 5, నమన్ ధిర్ 22 పరుగులు చేసి ఔటయ్యారు. హింగే, ఎషాన్ మలింగ, నితీశ్ కుమార్ రెడ్డి తలో వికెట్ తీశారు.

## వాంఖెడేలో సన్‌రైజర్స్ ఓపెనర్ల ఊచకోత... కన్నీళ్లు పెట్టుకున్న నీతా అంబానీ!


ముంబై ఇండియన్స్ యజమాని నీతా అంబానీ మైదానంలోనే కంటతడి పెట్టారు. సొంత మైదానం వాంఖెడే స్టేడియంలో, 244 పరుగుల లక్ష్యఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు సృష్టించిన పరుగుల విధ్వంసం చూసి ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ముంబై బౌలర్లు చేతులెత్తేయడం, సన్‌రైజర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆమె తన ఎమోషన్‌ను ఆపుకోలేకపోయారు. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఆరంభం నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. పవర్‌ప్లేలోనే వీరిద్దరూ వికెట్ నష్టపోకుండా 92 పరుగులు జోడించారు. బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించి ముంబై బౌలర్లకు చుక్కలు చూపించారు. ముఖ్యంగా ట్రావిస్ హెడ్ కేవలం 20 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీ కేవలం 8 ఓవర్లలోనే 126 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఈ క్రమంలో ఐపీఎల్‌లో ఆరో సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేసి, డేవిడ్ వార్నర్ – శిఖర్ ధావన్ పేరిట ఉన్న రికార్డును సమం చేశారు. ముంబై ప్రధాన బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనూ హెడ్, అభిషేక్ భారీ షాట్లు ఆడారు. వారి దూకుడుకు ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిస్సహాయంగా కనిపించగా, ఫీల్డర్లు కూడా క్యాచ్‌లను జారవిడిచారు. ఈ విధ్వంసకర బ్యాటింగ్ చూసే నీతా అంబానీ తన భావోద్వేగాన్ని నియంత్రించుకోలేకపోయారు.

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు చేయడం తెలిసిందే.




## స్పోర్ట్స్

### 'బ్యాట్‌లో ఏఐ చిప్' విమర్శలు.. అదిరిపోయే కౌంటర్ ఇచ్చిన వైభవ్




టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో అదరగొడుతున్నాడు. బౌలర్ ఎవరనేది సంబంధం లేకుండా క్రీజులోకి వచ్చిరావడంతోనే భారీ షాట్లతో విరుచుకుపడుతున్నాడు. ఇటీవల సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో 36 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు ఇప్పటివరకు ఈ ఐపీఎల్‌లో 9 మ్యాచ్‌ల్లో 400 పరుగులు చేసి అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. వైభవ్ ఆటను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది దిగ్గజ క్రికెటర్లు ప్రశంసిస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన క్రికెట్ విశ్లేషకుడు నౌమాన్ నియాజ్ మాత్రం ఎలాంటి ఆధారాలు లేకుండా వైభవ్ సూర్యవంశీ బ్యాట్‌లో ఏఐ చిప్ ఉండొచ్చంటూ నోరుపారేసుకున్నాడు. ఈ విమర్శలకు వైభవ్ గట్టిగానే బదులిచ్చాడు. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం తనపై ఆరోపణల గురించి సూర్యవంశీని అడగ్గా.. "ఆ దేవుడే బ్యాటులో ఏదో పెట్టాడు. నీ బ్యాట్‌లో ఏదో ఇస్తున్నానని భగవంతుడు పైనుంచి ముందే చెప్పాడు. నేను ఆ బ్యాట్‌నే వినియోగిస్తున్నాను" అంటూ ఘాటైన సమాధానమిచ్చి విమర్శలకు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియోను బుధవారం రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. వైభవ్ వయసులో చిన్నవాడే అయినా తనపై ఆరోపణలు చేస్తున్న వారికి తగినరీతిలో సమాధానమిచ్చాడని నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# ‘అనకాపల్లి’లో సంగీత ఉగ్రరూపం


## గూస్ బంప్స్ తెప్పిస్తున్న అమ్మోరు దిగినాది సాంగ్

నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా ఫేమ్ యాక్టర్ విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం ‘అనకాపల్లి’ ఇంటెన్స్ పల్లెటూరి యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతున్నట్టు ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. విక్రమ్ సాహిదేవ్ తన సరికొత్త లుక్, పవర్‌ఫుల్ యాక్టింగ్‌తో ఇంప్రెస్ చేస్తున్నాడు. ఈ వేసవి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఈ మూవీ నుంచి అమ్మోరు దిగినాది సాంగ్‌ను విడుదల చేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటలో సీనియర్ నటి సంగీత ఉగ్రరూపం చూడొచ్చు. అగ్రెసివ్‌గా మంగ్లీ వాయిస్‌తో సాగుతున్న ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలువనుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఓ జాతరను చూస్తున్నామా..? అన్నట్టుగా సాగుతున్న ఈ పాట మ్యూజిక్ లవర్స్‌కు కనెక్ట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీలో త్రినాథరావు నక్కిన, ఇంద్రజ అబ్బూర్, మహబూబ్‌నగర్ భాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాంద్రేగుల నాయుడు, నందినీ రాయ్, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నక్కిన నరేటివ్స్, భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాంద్రేగుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు త్రినాథరావు నక్కిన స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించగా.. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నాడు. డావ్‌జాండ్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నాడు.



## అది నా పెద్ద తప్పు.. ఆ సమయంలో నా మైండ్ పని చేయలేదు.. ఫరియా అబ్దుల్లా ఎమోషనల్

బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం (మే 1 విడుదల) ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. ‘జాతిరత్నాలు’ తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ‘హనుమాన్’ వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా ‘నో’ చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది. కథలు ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ ‘గాయపడ్డ సింహం’ సినిమాపైనే పెట్టుకుంది.



## యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఎపిక్.. టీజర్ రిలీజ్

బేబీ మూవీ జోడీ మరోసారి బిగ్ స్క్రీన్‌పై సందడి చేయనుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కుతోన్న మూవీ ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్. ఈ సినిమాకు 90ం ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ చూస్తుంటే యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కాలేజీ డేస్, కెరీర్ నేపథ్యంలో ఈ మూవీ కథ ఉండనున్నట్లు టీజర్‌లో అర్థమవుతోంది. ఈ చిత్రంలో శివాజీ కీలక పాత్రలో కనిపించనున్నారు. కాగా.. ఈ సినిమాకు హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతమందిస్తున్నారు.




## అల్లు అర్జున్ రాకా.. అప్పుడే క్యూ కడుతున్నారా?

పుష్ప తర్వాత అల్లు అర్జున్ రేంజ్ పూర్తిగా మారిపోయింది. ఆయన మార్కెట్ కేవలం దక్షిణాదిలోనే కాదు..నార్త్‌లోనూ ఫుల్ క్రేజ్ ఉంది. పుష్ప–2 రిలీజ్ టైమ్‌లో బీహార్‌లో గ్రాండ్‌గా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. పుష్ప 2 నార్త్‌లో కేవలం హిందీలోనే రూ. 812 కోట్లు వసూలు చేసి రికార్డ్ సృష్టించింది. దీంతో బన్నీకి ఉత్తారాదిలోనూ భారీస్థాయిలో మార్కెట్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం తెరకెక్కుతోన్న రాకా మూవీపై నార్త్ ఆడియన్స్‌లోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అట్లీ డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమా కోసం డిస్ట్రిబ్యూటర్స్ క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా హక్కుల కోసం బిహార్‌లో తీవ్రమైన పోటీ ఉందని ఓ నివేదికలో వెల్లడైంది. ఆ రాష్ట్రంలో ఈ సినిమా హక్కుల కోసం ఇప్పటికే ‘రాకా’ చిత్ర నిర్మాతలను సంప్రదించారని తెలిపింది.

ఈ మూవీ రైట్స్ కోసం భారీ ధర చెల్లించేందుకు డిస్ట్రిబ్యూటర్స్ రెడీగా ఉన్నారట. ఇదంతా చూస్తుంటే బిహార్‌లో బన్నీకి ఎంత క్రేజ్ ఏంటో అర్థమవుతోంది. కాగా.. పుష్ప 2: ది రూల్ మూవీ బీహార్‌తో పాటు ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్‌లోనూ కలెక్షన్ల వర్షం కురిపించింది. ఇప్పుడు రాకా సినిమాకు సైతం ఇలాంటి స్పందనే వస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూవీ రైట్స్ కోసం భారీ పోటీ నెలకొంది. కాగా.. ఈ చిత్రంలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా టైటిల్‌తో ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మూవీని తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.